RNI NO. TELTEL/2021/81092 Published from Jagtial Email: prajamantalu@gmail.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 3 పేజీలు - 8

సంచిక (Issue) : 304 వెల - రూ 5:00

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు prajamantalu.com

ఆదివారం 19, మార్చి 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,

## అస్సాంలో టెన్త్ జాగ్రఫీ పేపర్ లీక్!

**వదంతులు నమ్మొద్దన్న ప్రభుత్వం**



**గౌహతి, మార్చి 18 (ప్రజామంటలు):** పరీక్ష పేపర్ల లీకేజీలతో అస్సాం అట్టుడు కుతున్నది. కొద్ది రోజుల క్రితం పదో తరగతి పరీక్షకు చెందిన రెండు పేపర్లు లీక్ కావడం సంచలనం సృష్టించింది. తాజాగా శనివారం సైతం మరో పేపర్ లీకైందంటూ విస్తృ తంగా ప్రచారం జరిగింది. అయితే దీన్ని ప్రభుత్వం ఖండిస్తూ అలాంటి వదంతులను నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారులుగా భావిస్తున్న ఇద్దరు టీచర్లను ఆదివారం లఖింపూర్ నుంచి గౌహతికి తీసుకు రానున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, టీచర్లను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు.



# ఎవరున్నా వదలిపెట్టం...

**పటిష్టంగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్**

**ఇద్దరు చేసిన తప్పుకు వ్యవస్థను తప్పు పట్టరాదు**

**పబ్లిక్ సర్వీస్ కమిషన్ వ్యవస్థ పటిష్టంగానే ఉంది**

**అపోహలు సృష్టించేవారిని యువత నమ్మొద్దు**

**త్వరలోనే మళ్లీ పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తాం**

**విద్యార్థులు పరీక్ష ఫీజును చెల్లించాల్సిన అవసరం లేదు**

**తప్పు చేసిన ఇద్దరి వెనక ఎవరున్నా వదలిపెట్టం**

**మీడియా సమావేశంలో మంత్రి కెటిఆర్ స్పష్టీకరణ**

**హైదరాబాద్,మార్చి18(ప్రజామంటలు):** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పటిష్టంగా ఉందని...పేపర్ లీకేజీ వెనక ఇద్దరు వ్యక్తులు ఉన్నారని.. వాళ్లిద్దరు చేసిన తప్పు అని.. ఇది వ్యవస్థ చేసిన తప్పు కాదని మంత్రి కేటీఆర్ వివరించారు. భారత దేశంలోనే అత్యుత్తమ పబ్లిక్ సర్వీస్ కమిషన్ లలో ఒకటిగా గుర్తింపు టీఎస్ పీఎస్సీ గుర్తింపు పొందిందని.. కాలాగుణంగా సాంకేతికంగా ముందుకు వెళుతుందన్నారు. అందులో భాగంగానే ఓటీఆర్.. వన్ టైం రిజిస్ట్రేషన్ తీసుకు రావటం జరిగిందన్నారు. ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అపోహలు సృష్టించే వారిని నమ్మొద్దని మంత్రి కేటీఆర్ తెలంగాణ యువతకు సూచించారు. టీఎస్ పీఎస్సీ చైర్మన్, నలుగురు మంత్రుల తో సుదీర్ఘంగా చర్చించిన తర్వాత.. సీఎం కేసీఆర్ మాటగా.. శనివారం.. సమావేశం వివరాలను మంత్రి కేటీఆర్ మీడియాకు వివరించారు. వీళ్లిద్దరే కాకుండా లీకేజీ కేసులో ఇంకెవరు ఉన్నా.. అందరినీ కఠినంగా శిక్షిస్తామన్నారు. ఇద్దరు వ్యక్తులు చేసిన తప్పు అని.. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎంతో సమర్థ వంతంగా పని చేస్తుందని.. వ్యవస్థ చక్కగా ఉందని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 155 నోటిఫికేషన్లు విడుదల అయ్యాయని.. 37 వేల ఉద్యోగాలను టీఎస్ పీఎస్సీ ద్వారా భర్తీ చేయటం జరిగిందన్నారు. టీఎస్ పీఎస్సీ ద్వారా ఒకే సారి 10 లక్షల మందికి పరీక్ష నిర్వహించిన ఘనత సాధించిందన్నారు. డిజిటల్ చెల్లింపులు.. కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించిన ఘనత కూడా టీఎస్ పీఎస్సీదే అని వివరించారు మంత్రి కేటీఆర్. 99 పరీక్షలను నిర్వహించటం ద్వారా.. నాలుగున్నర లక్షల మంది స్టూడెంట్స్ హాజరయ్యారని వివరించారాయన. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు.. రెండుసార్లు తెలంగాణకు వచ్చి టీఎస్ పీఎస్సీపై అధ్యయనం చేశారని.. దేశంలోని 13 రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు వచ్చి పరిశీలించి.. అధ్యనం చేసి.. ఆయా రాష్ట్రాల్లో అమలు చేశారని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. దేశంలోనే అత్యధిక ఉద్యోగాలను భర్తీ చేసిన సర్వీస్

మిగతా... 2లో

## లీకేజీతో నాకేంటి సంబంధం

**ఘాటుగా స్పందించిన మంత్రి కెటిఆర్**



**హైదరాబాద్, మార్చి 18 (ప్రజామంటలు):** టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీతో తనకేం సంబంధం అని మంత్రి కేటీఆర్ ప్రశ్నిం ఆరు. ప్రతిపక్షాలు మాట్లాడితే ఐటీ మినిస్టర్‌ను బర్తరఫ్ చేయాలని అంటు న్నారని..అసలు ఐటీ డిపార్ట్‌మెంట్ పని ఏంటో తెలుసా..ఐటీ మినిస్టర్ ఏం చేస్తరో తెలుసా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రతీ కంప్యూటర్ కు తానే బాధ్యున్నా అని అడిగారు. ఐటీ డిపార్ట్ మెంట్ పై అవగాహన లేని వారు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దని మంత్రి కేటీఆర్ సూచించారు. అనవసర వ్యాఖ్యానాల వల్ల విద్యార్థుల్లో అనుమానం కల్పించొద్దన్నారు. 2014 ఎన్నికల ముందు ప్రధాని మోదీ ఏడాదికి ఎన్ని కోట్ల ఉద్యోగాలు ఇస్తారని చెప్పారు..ఇంత వరకు ఎన్ని ఇచ్చారని ప్రశ్నించారు. ఉద్యోగాలు ఇవ్వని ప్రధాని మోదీ...కేంద్ర ప్రభుత్వ సంస్థలను అమ్ముతున్నారని మండిపడ్డారు. నాలుగు పరీక్షలను రద్దు చేయడం వల్ల ఈ పరీక్షలకు ఇప్పటికే క్వాలిఫై అయిన విద్యార్థులకు బాధ ఉంటుందని మంత్రి కేటీఆర్ అన్నారు. కానీ పెద్ద మనసుతో విద్యార్థులు ఆలోచించాలన్నారు. చాలామంది విద్యార్థులు మళ్లీ పరీక్షలు రాయాలా అని బాధపడు తున్నారని..కానీ అనుమా నాలు వ్యక్తం అయిన తరుణంలో పరీక్షలు రాయక తప్పదన్నారు.

# సిట్టింగ్ జడ్జితో విచారణకు డిమాండ్

- **టిపిఎస్‌సి పేపర్ లీకేజీ కేసు**
- **నేడు గాంధారిలో రేవంత్ ఒకరోజు దీక్ష**
- **కామారెడ్డిలో జోరుగా సాగిన రేవంత్ పాదయాత్ర**

**కామారెడ్డి,మార్చి18(ప్రజామంటలు):** కామారెడ్డి నియోజకవర్గంలో పిసిసి చీఫ్ ఏంవత్ రెడ్డి పాద యాత్ర కొనసాగింది. మాజీమంత్రి షబ్బీర్ అలీ తదితరులు వెంట నడిచారు.కామారెడ్డి అయ్యప్ప



నగర్ నుంచి నిజాంసాగర్ చౌరస్తావరకు పాద యాత్ర సాగింది. పేపర్ లీకేజ్ వ్యవహారంపై ఎల్లారెడ్డిలోని గాంధారి మండల కేంద్రంలో ఆదివారం నిరుద్యో నిరసన దీక్ష చేపట్టనున్నట్లు పిసిసి చీఫ్ ఏంవత్ రెడ్డి ప్రకటించారు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దీక్ష ఉంటుందన్నారు. మాజీమంత్రి షబ్బీర్ అలీతో కలసి పాదయాత్రలో పాల్గొన్నారు. కేటీఆర్ ను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. నిరుద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు 21న గవర్నర్ ను కలిసి పరిణామాలను వివరిస్తాం. కేటీఆర్ పీఏ పాత్ర కూడా ఉందని ఆరోపణలు వస్తున్నాయన్నారు. కరీంనగర్ జిల్లా మల్యాల మండలానికి చెందిన వంద మందికి గ్రూప్-1లో 100కుపైగా మార్కులు వచ్చాయి. దీనిపైన కూడా పూర్తి విచారణ చేయాలన్నారు. సిరిసిల్ల నిరుద్యోగి చనిపోతే సానుభూతి తెలిపేందుకు కూడా అవకాశం ఇవ్వడం లేదు. ఆ కుటుంబాన్ని బెదిరించి దహన సంస్కారాలు పూర్తి చేయించారు. కన్నకొడుకు మరణిస్తే ఏడ్చే అవకాశం కల్పించలేదని రేవంత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇకపోతే కేటీఆర్ షాడో సీఎంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు లీకేజ్ ఘటనలో అరెస్ట్ చేసిన 9 మందిని విచారణ చేయలేదు. ఇద్దరు వ్యక్తులే నేరానికి పాల్పడ్డారని కేటీఆర్ ఎలా ప్రకటిస్తారు? బీఆర్ఎస్‌లో ఉన్న పెద్ద తలల్ని కేటీఆర్ కాపాడారు.

మిగతా... 2లో

## దేశంలో మరోమారు కరోనా బెల్స్

- **800 దాటిన కేసుల సంఖ్య**
- **రాష్ట్రాలను హెచ్చరించిన కేంద్రం**



**న్యూఢిల్లీ,మార్చి18(ప్రజామంటలు):** దేశంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతుంది. 126 రోజుల తర్వాత.. రోజువారీ కేసుల నమోదు ఎనిమిది వందలు దాటటంతో.. అలర్ట్ ప్రకటించింది కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ. ప్రతి రోజూ బాధితులు పెరుగుతూ ఉండటంపై.. అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేస్తోంది. జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తుంది. వాతావరణ మార్పులు.. ఇతర వైరస్‌లతో జనం ఇబ్బంది పడుతున్న సమయంలోనే.. కరోనా కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమే. 2023, మార్చి 17వ తేదీ శుక్రవారం నాటికి దేశ వ్యాప్తంగా 5 వేల 389 మంది కరోనాకు చికిత్స తీసుకుంటున్నారు. మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఒక్కొక్కరు చొప్పున చనిపోయినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. యాక్టివ్ కేసుల సంఖ్య పెరుగుతున్నా.. కోలుకుంటున్న వారి సంఖ్య అదే స్థాయిలో ఉందని.. మరణాల రేటు అతి స్వల్పంగా ఉందని స్పష్టం చేసింది. ఇన్ఫెక్షన్

మిగతా... 2లో

## కించపరిచేలా మాట్లాడలే

- తెలంగాణ వాడుక పదాన్నే మాట్లాడా: బండి

**హైదరాబాద్,మార్చి18(ప్రజామంటలు):** తాను ఎవరిని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయలేదని బీజేపీ తెలంగాణ చీఫ్ బండి సంజయ్ అన్నారు. తెలంగాణలో ఉన్న వాడుక పదాన్నే తాను ఉపయోగించానని అన్నారు. కవితనుద్దేశించి చేసిన వ్యాఖ్యలపై శనివారం మహిళా కమిషన్ ముందు హాజరై వివరణ ఇచ్చారు. అనంతరం మాట్లాడిన ఆయన తెలంగాణలోని సామెతను మాత్రమే చెప్పానన్నారు. తాను చేసిన వ్యాఖ్యలపై కట్టుబడి ఉన్నట్లు రెండు పేజీల్లో వివరణ ఇచ్చారు. ఆయన సమాధానం పట్ల మహిళా కమిషన్ ఏ నిర్ణయం తీసుకుందనేదానిపై ఉత్కంఠ నెలకొంది . ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవినుద్దేశించి వ్యాఖ్యలు చేశారని మహిళా కమిషన్ బండి సంజయ్ కు నోటీసులిచ్చింది. మార్చి 15న వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని కోరింది. పార్లమెంట్ సమావేశాలున్నందును మార్చి 15న హాజరు కాలేనని 18న హాజరవుతానని మహిళా కమిషన్ కు బండి సంజయ్ లేఖ రాశారు. ఈ క్రమంలోనే బండి సంజయ్ మహిళా కమిషన్ ముందు హాజరయ్యారు. మహిళా కమిషన్ శనివారం సుమారు రెండున్నర గంటల పాటు సంజయ్‌ను విచారించింది. రాజకీయంగా, మరొక



విధంగానైనా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని, మరోసారి ఇలాంటి వాక్యాలు చేయకూడదని కమిషన్ సూచించింది. మహిళల పట్ల పలు సందర్భాల్లో బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను మహిళ కమిషన్ వీడియోల రూపంలో చూపించి ప్రశ్నల వర్షం కురిపించింది. బతుకమ్మను, మహిళలను లంగలు, దొంగలు అంటూ చేసిన అనుచిత వ్యాఖ్యల వీడియోలు చూపిస్తూ కమిషన్ విచారణ చేసింది. భవిష్యత్తులో మహిళల పట్ల ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయకూడదంటూ బండి సంజయ్‌కు ఆదేశించింది. కాగా ఎమ్మెల్సీ కవితపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై బండి సంజయ్ వ్రాత పూర్వకంగా

మిగతా... 2లో

## ఖలిస్తాన్ నేత అమృతపాల్ సింగ్ అరెస్ట్

**అరెస్ట్‌తో అంక్షలు విధించిన పోలీసులు**

**జలంధర్,మార్చి18(ప్రజామంటలు):** ఖలిస్థాన్ నేత, వారిస్ పంజాబ్ దే చీఫ్ అమృత్ పాల్ సింగ్‌ను పంజాబ్ పోలీసులు



శనివారం జలంధర్ సమీపంలో అరెస్ట్ చేశారు. అంతకుముందు ఆయనకు సన్నిహితంగా ఉండే ఆరుగురిని అరెస్ట్ చేశారు. ఈ ఆరుగురిని గుర్తు తెలియని ప్రదేశంలో ఉంచి, ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. అమృత్ పాల్ సింగ్ షాహ్‌కోట్ సమీపంలో ఉన్నట్లు గుర్తించిన పంజాబ్ పోలీసులు శనివారం ఉదయ

మిగతా... 2లో

## అధికార పార్టీలకు గుణపాఠం

- **రెండు రాష్ట్రాల్లో ఇరు పార్టీలకు చెంపపెట్టు**
- **టీచర్లు, పట్టబద్రుల్లో ప్రస్ఫుటంగా వ్యతిరేకత**

**హైదరాబాద్,మార్చి18:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్ఇనకల ఫలి తాలు అధికార పార్టీలకు దిమ్మతిరిగే షాక్ ఇచ్చాయి. తెలంగాణలో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలో బిజెపి అభ్యర్థి గెలుపొందారు. ఇక ఏపిలో రెండు పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి విజయం సాధించింది. దీంతో అధికార పార్టీలకు షాక్ తగలడంతో అధికార పార్టీల్లో నిస్తేజం నిర్వేదం నెలకొంది. ముఖ్యంగా వైసీపీ అత్యంత బలంగా ఉన్న తూర్పు రాయలసీమలో వైసీపీ అభ్యర్థి ఓడిపోవడం ఆ పార్టీని నిశ్చేష్టపరిచిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. వాస్తవానికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా వైసీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఎన్నికల నోటిఫికేషన్ కు ముందు నుంచే సీఎం జగన్ పార్టీ నేతలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని సూచించారు.

మిగతా... 2లో

## ప్రజానాడి







## మన బస్తీ- మనబడి పనులు వేగవంతం

- **అధికారులను ఆదేశించిన మంత్రి తలసాని**

**హైదరాబాద్,మార్చి18(ప్రజామంటలు):** మన బస్తీ-మనబడి పనులను వేగవంతంగా చేపట్టి మే నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. శనివారం నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ లో మన బస్తీ- మన బడి కార్యక్రమం కింద మొదటి విడతలో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులపై మంత్రి అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించడం ద్వారా విద్యార్థులకు ఆహ్లాదకరమైన

మిగతా... 2లో

## నగరంలో భారీ వర్షం

**కుండపోతగా కురిసిన వాన**

**హైదరాబాద్,మార్చి18(ప్రజామంటలు):** నగరంలో వర్షం దంచికొట్టింది. నగరంతో పాటు పలు జిల్లాల్లో అకాల వర్షాలు కరిసాయి. అలాగే కరీంనగర్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో వర్షం కురిసింది కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా భారీగా వానలు పడుతున్నాయి. పలు జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వడగండ్ల వానలు కురుస్తున్నాయి. శనివారం సాయంత్రం హైదరాబాద్ నగరంలో కుండపోత వర్షం పడుతుంది. నగరంలో గత నాలుగు రోజులుగా

మిగతా... 2లో





## కవిత బాటలోనే మాగుంట

**ఇడి విచారణకు హాజరుపై ఉత్కంఠ**

**నిర్ణీత సమయం దాటినా రాలేక పోయిన ఎంపి**

**న్యూఢిల్లీ,మార్చి18(ప్రజామంటలు):** ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి ఒంగోలు వైసీపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కూడా కవిత బాటలోనే నడుస్తున్నారు. ఆయనను మార్చి 18న విచారణకు రావాలని ఈడీ ఆదేశించింది. కవిత తమ విచారణకు సహకరించకపోవడంతో ముందు మాగుంట శ్రీనివాసులరెడ్డి వైపు నుంచి మద్యం కుంభకోణం కేసును నరుక్కురావాలని ఈడీ భావిస్తున్న సంగతి తెలిసిందే. అయితే మార్చి 18న ఈడీ విచారణకు వైసీపీ ఎంపీ మాగుంట

మిగతా... 2లో

# మన బస్తీ- మనబడి పనులు వేగవంతం

**మొదటిపేజీతరువాయి..**

వాతావరణంలో విద్యాబోధన జరగాలనేది ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని వెల్లడించారు. ఈ కార్యక్రమం అమలు కోసం రాష్ట్రంలో 26,065 పాఠశాలల్లో అభివృద్ధి పనులకోసం రూ. 7,289 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఇందులో మొదటి విడతలో 35 శాతంగా 9,123 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఇందుకు గాను రూ. 3,497 కోట్లను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ నిధులతో పాఠశాలల్లో ప్రహరీగోడ నిర్మాణం, భవనాలకు పెయింటింగ్, విద్యుత్ సౌకర్యం, తాగునీటి సరఫరా, టాయిలెట్స్ నిర్మాణం, ఫర్నిచర్ ఏర్పాటు, గ్రీన్ చాక్ బోర్డ్ ఏర్పాటు వంటి పనులను చేపడు తున్నట్లు వివరించారు. హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల పరిధిలో 690 పాఠశాలలు ఉండగా, మొదటి విడతలో 239 పాఠశాలల ను అభివృద్ధి పనులను గుర్తించి రూ. 44 కోట్లను కేటాయించినట్లు వెల్లడించారు. వీటిలో వివిధ కారణాలతో 198 పాఠశాలల్లో మాత్రమే పనులను చేపట్టినట్లు వివరించారు. ఈ పనులను కూడా ప్రభుత్వరంగ సంస్థలైన జీహెచ్ఎంసీ,టీఎస్ ఎంఐడీసీ, టీఎస్ టీడబ్ల్యూఈడబ్ల్యూఐడీసీ, సీఆర్ఐటీసీ ల ఆధ్వర్యంలో చేపట్టామని పేర్కొన్నారు. సమావేశంలో హోంమంత్రి మహమూద్ అలీ, ప్రభుత్వ విప్ ప్రభాకర్ రావు, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కాలేరు వెంకటేశ్, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ దేవసేన, జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, విద్యాశాఖ, అధికారులు పాల్గొన్నారు.

# కవిత బాటలోనే మాగుంట

**మొదటిపేజీతరువాయి..**

శ్రీనివాసులరెడ్డి హాజరు కాలేదు. ఈడీ ఆదేశాల మేరకు మార్చి 18న శనివారం ఉదయం 11 గంటలకే ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి విచారణ నిమిత్తం మాగుంట శ్రీనివాసులరెడ్డి వెళ్లాల్సి ఉంది. అయితే మధ్యాహ్నం 1.30 గంటల వరకు కూడా ఆయన విచారణకు హాజరు కాలేదు. దీంతో ఈడీ విచారణకు మాగుంట వెళ్తారా? లేదా అనేదానిపై ఉత్కంఠ నెలకొంది.

కాగా తెలంగాణ సీఎం కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత సైతం ఈడీ విచారణకు హాజరుకాకుండా సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఆమె పిటిషన్ ను సుప్రీంకోర్టు కొట్టేసింది. దీంతో మార్చి 20 విచారణకు రావాలని కవితకు ఈడీ మరోసారి నోటీసులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఇప్పటికే సుమారు 10 మందికి పైగా అరెస్టు అయ్యారు. ఇదే కేసులో వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కుమారుడు మాగుంట రాఘవరెడ్డిని గతేడాది అక్టోబర్లోనే సీబీఐ ప్రశ్నించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఆయనతోపాటూ.. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను కూడా సీబీఐ ప్రశ్నించింది. ఫిబ్రవరిలో ఈడీ రంగంలోకి దిగి రాఘవను అందుపులోకి తీసుకుంది. మధ్యవర్తుల ద్వారా ఢిల్లీలోని కేజ్రీవాల్ ప్రభుత్వానికి లంచాలు ఇచ్చారని మాగుంట రాఘవపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 11న రాఘవరెడ్డిని ప్రశ్నిస్తున్న ఈడీ అధికారులు.. ఆయన సరిగా సహకరించట్లేదనే ఉద్దేశంతో అరెస్టు చేశారు.కాగా సౌత్ గ్రూప్ కు సంబంధించి అభిషేక్ బోయినపల్లి శరత్ చంద్రారెడ్డి ఆడిటర్ గోరంట్ల బుచ్చిబాబు రాఘవరెడ్డి ఇప్పటివరకూ అరెస్ట్ అయ్యారు. కాగా మాగుంట రాఘవ విషయానికొస్తే.. బాలాజీ డిస్టిలరీస్ కాకుండా ఏంజెల్ షాంపైన్ ఎల్ఎల్పీ తమిళనాడు డిస్టిలరీ ఇండస్ట్రియల్ ఆల్కహాల్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ఇతర కంపెనీలు మాగుంట కుటుంబానికి సంబంధించిన రెండు కీలక సంస్థలపై సీబీఐ దృష్టి సారించిందని చెబుతున్నారు. మద్యం తయారీ పంపిణీలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవ హారంలో తనకు ఏమాత్రం సంబంధం లేదని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పలుమార్లు స్పష్టం చేశారు. ఇదంతా ఉత్తర భారతదేశ వ్యాపారుల కుట్ర అని ఆయన స్పష్టం చేశారు. అయితే ఈడీ మాత్రం విచారణ సాగిస్తోంది. ఈ నేపథ్యంలోనే శనివారం వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది. అయితే ఆయన విచారణకు హాజరు కాకపోవడంతో ఈడీ ఎలా స్పందిస్తుదనేది ఆసక్తికరంగా మారింది.

# నగరంలో భారీ వర్షం

**మొదటిపేజీతరువాయి..**

ఆకాల వర్షాలు కురవడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రానున్న 48 గంటల్లో రాష్ట్రంలో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రస్తుతం నగరంలో ఉరుములతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. పలు ప్రాంతాల్లో వడగండ్ల వాన పడుతోంది. నగరంలోని కుత్బుల్లా పూర్, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్ పరిసర ప్రాంతాల్లో వడగండ్ల వాన కురుస్తోంది. పంజాగుట్ట, అమీర్‌పేట్, ఖైరతాబాద్, మెహిదీపట్నం, బంజారాహిల్స్, జుబ్లీహిల్స్ లో భారీ వర్షం కురుస్తోంది. బహదూర్‌పురా, ఫలక్ నుమా, సికింద్రాబాద్, ప్యాట్నీసెంటర్, బేగంపేట, అల్వాల్‌లో వరుణుడు ప్రతాపం చూపిస్తున్నాడు. చిలకలగూడ, తిరుమలగిరి, బోయిన్‌పల్లి, మారేడుపల్లి, ఓయూక్యాంపస్, హబ్సీగూడ, నాచారం, మల్లాపూర్ ప్రాంతాల్లో వర్షం పడుతోంది. హైదరాబాద్ సిటీ శివార్లలో వడగండ్లు పడటం కామన్.. అయితే మార్చి 18వ తేదీ శనివారం సాయంత్రం సిటీ నడిబొడ్డున వడగండ్ల బీభత్సం భయాందోళనలకు గురి చేసింది. వడగండ్లతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా బైక్స్ పై వెళ్లే వాళ్లకు దెబ్బలు తగిలాయి. కొన్ని ప్రాంతాల్లో కార్లపై వడగండ్లు పడి.. అద్దాలు పగిలాయి.

# దేశంలో మరోమారు కరోనా బెల్స్

**మొదటిపేజీతరువాయి..**

రేటు.. వ్యాప్తి రేటు జీరో పాయింట్ జీరో వన్ శాతంగానే (0.01శాతం) ఉందని వెల్లడించింది. దేశవ్యాప్తంగా కరోనా వ్యాక్సినేషన్ డ్రైవ్ కింద.. ఇప్పటి వరకు 220 కోట్ల డోసులు ఇవ్వటం జరిగిందని వివరించింది. 126 రోజుల తర్వాత రోజువారీ కరోనా కేసుల నమోదు 800కు చేరుకోవటం ఇదే అని కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వశాఖ వివరించింది.

# అధికార పార్టీలకు గుణపాఠం

**మొదటిపేజీతరువాయి..**

ఈ నేపథ్యంలో వైసీపీ ట్రబుల్ షూటర్ గా పేరున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇతర మంత్రులు ఎమ్మెల్యేలందరినీ అప్రమత్తం చేశారు.రాయలసీమ పెద్దాయనగా పిలుచుకునే సీనియర్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇతర మంత్రులు ఉషశ్రీ చరణ్ తదితర మంత్రులు ఎమ్మెల్యేలు కార్పొరేషన్ల చైర్మన్లు ఎమ్మెల్సీలు స్థానిక నేతలు అంతా ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం చేసినా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోవడం పట్ల వైసీపీలో అంతర్మథనం నెలకొందని అంటున్నారు. వాస్తవానికి 2014 2019 అసెంబ్లీ ఎన్నికల్లో రాయలసీమలో ఉన్న 52 సీట్లలో వైసీపీ అత్యధిక స్థానాలను గెలుచుకుంది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో అయితే రాయలసీమలో ఉన్న 52 అసెంబ్లీ స్థానాల్లో 49 స్థానాలను వైసీపీ గెలుచుకుంది. టీడీపీ మూడు స్థానాలకే పరిమితమైంది. అలాంటిది నాలుగేళ్లు తిరిగేటప్పటికీ సీన్ రివర్స్ అయింది. తూర్పు రాయలసీమ పట్టభద్రుల స్థానంలో వైసీపీ ఏకంగా 11 శాతం ఓట్ల తేడాతో టీడీపీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ చేతిలో చిత్తయింది. ప్రకాశం నెల్లూరు చిత్తూరు జిల్లాల పరిధిలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల స్థానం ఉంది. ఈ మూడు జిల్లాలు వైసీపీ కంచుకోటలు. అయితే పట్టభద్రుల ఎన్నికలకు వచ్చేటప్పటికీ ఈ మూడు జిల్లాల్లో వ్యతిరేక ఫలితాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో సీఎం జగన్ ఆదేశాలకు తగ్గట్టే మంత్రులు ఎమ్మెల్యేలు కూడా పట్టభద్రుల ఎమ్మెల్యే ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. దొంగ ఓట్లను పెద్ద ఎత్తున చేర్చారని ప్రతిపక్షాలు వివిధ సంఘాలు ఆరోపించాయి. ఏడు ఎనిమిది తరగతి మాత్రమే చదివినవారిని కూడా పట్టభద్రులుగా ఓటర్ల జాబితాలో వైసీపీ నేతలు నమోదు చేయించారనే విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా తిరుపతిలో వందల సంఖ్యలో దొంగ ఓట్లు బయటపడ్డాయి. మరోవైపు వలంటీర్ల ద్వారా అధికార వైసీపీ డబ్బులు పంచిందనే విమర్శలు వచ్చాయి. ఒక్కో ఓటుకు రూ.5 వేలు నుంచి రూ.6 వేల వరకు వైసీపీ డబ్బులు పంచిందని మీడియాలోనూ వార్తలు హల్చల్ చేశాయి.

# ఎవరున్నా వదలిపెట్టం...

**మొదటిపేజీతరువాయి..**

కమిషన్‌గా.. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గుర్తింపు పొందిందని స్పష్టం చేశారాయన. 28 రాష్ట్రాల్లో ఎక్కడా జరగని విధంగా.. ఏడు భాషల్లో ఒకేసారి పరీక్షలు నిర్వహించిన ఘనత కూడా టీఎస్ పీఎస్సీదే అన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్




పటిష్టంగానే ఉందని, కేవలం ఇద్దరు వ్యక్తుల వల్లే పేపర్ లీకేజీ జరిగిందని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. నిరుద్యోగ యువత ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గతంలో దరఖాస్తు చేసుకున్న వారంతా మళ్లీ పరీక్షలకు హాజరు కావొచ్చని కేటీఆర్ పేర్కొన్నారు. పారదర్శకత తీసుకురావాలని అనేక చర్యలు చేపట్టడం జరిగింది. ఉమ్మడి ఏపీలో ఏపీపీఎస్సీ మీద ఆరోపణలు వచ్చేవి. కానీ 37 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. ఒక్క ఆరోపణ కూడా రాలేదు. గతంలో ఇంటర్వ్యూల్లో తప్పులు జరిగాయని టీఎస్‌పీఎస్సీ రద్దు చేసింది. రాతపరీక్ష, మెరిట్ లిస్ట్ ఆధారంగా ఉద్యోగ నియామకాలు చేపడుతున్నాం అని కేటీఆర్ తెలిపారు. దురదృష్టవశాత్తు ఇద్దరు వ్యక్తులు చేసిన తప్పు వల్ల మొత్తం వ్యవస్థకే చెడ్డపేరు వచ్చిందన్నారు. ఇది జరగకూడని పని. నివారించాల్సిందే. రాష్ట్ర యువతలో భరోసా నింపాల్సిన బాధ్యత మా మీద ఉంది.. కచ్చితంగా ప్రవీణ్, రాజశేఖర్ అనే ఇద్దరు వ్యక్తులే కాదు.. వీళ్ల వెనకాల ఎవరున్న తప్పకుండా వారిని కఠినంగా శిక్షిస్తాం. ఈ విషయంలో ఎలాంటి రెండో అభిప్రాయం పెట్టుకోవద్దు. ఇది వ్యవస్థ తప్పు కాదు.. ఇది కేవలం ఇద్దరి తప్పు. పరీక్షలను రద్దు చేయడం వల్ల లక్షలాది మంది పిల్లలకు ఇబ్బంది కలుగుతుంది. మేం కూడా బాధపడుతున్నాం. నీళ్లు, నిధులు, నియామకాలు అనే పునాది మీదనే తెలంగాణ ఉద్యమం నడిచిందన్నారు. అభ్యర్థులు ఎవరూ మళ్లీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ నాలుగు పరీక్షలు గతంలో రాసిన వారు మళ్లీ చెల్లించాల్సిన అవసరం లేదు. వీలైనంత త్వరగా పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తాం. అభ్యర్థులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో.. గ్రూప్-1, టీపీబీవో, డీఏవో, ఏఈఈ ఎగ్జామ్స్‌కు సంబంధించిన మెటీరియల్‌ను ఆన్‌లైన్‌లో అందుబాటులో పెడుతాం. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్టడీ సర్కిళ్లను బలోపేతం చేస్తాం. జిల్లాల్లో రీడింగ్ రూమ్స్ 24 గంటలు తెరిచి ఉంటాయి. ఫ్రీ మెటీరియల్‌తో పాటు ఉచిత భోజన వసతి కూడా కల్పిస్తాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసు నిందితులను సిట్ కస్టడీకి అప్పగించారు. 9 మంది నిందితులను 6 రోజుల కస్టడీకి నాంపల్లి కోర్టు అనుమతించింది. చంచల్‌గూడ జైలు నుంచి నిందితులను సిట్ అదుపులోకి తీసుకుంది. పేపర్ లీక్ వ్యవహారంలో ఆర్థిక లావాదేవీలపై సిట్ కూపీ లాగనుంది. ప్రశ్నాపత్రం ఎవరెవ్వరికి విక్రయించారనే దానిపై సిట్ ఆరా తీయనుంది. నిందితులను మార్చి 23 వరకు సిట్ అధికారులు విచారణ చేయనున్నారు.

# సిట్టింగ్ జడ్జితో విచారణకు డిమాండ్

**మొదటిపేజీ తరువాయి..**

అధికారులపై ఒత్తిడి చేయడానికే కేటీఆర్ ఈ ప్రకటన చేశారా? రాజశేఖర్, ప్రవీణ్ పెద్దలకు తెలియకుండానే వ్యవహారం నడిపారా? ఇంటి దొంగలు బయటపడతారనే కేటీఆర్ హడావుడిగా బయటకు వచ్చారు. ఈ తప్పిదాలకు రాష్ట్ర ప్రభుత్వం, కేటీఆర్ బాధ్యత వహించాలని రేవంత్ అన్నారు. కేసును పూర్తిగా నీరుగార్చేందుకు కేటీఆర్ ప్రయత్నిస్తున్నారు. ఈ కేసును సీబీఐతో విచారణ చేయించాలి. సీబీఐ పై నమ్మకం లేకపోతే సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కష్టపడి పనిచేసే మీకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది. ఈ పార్టీకి ఒకసారి అవకాశం ఇవ్వండి రైతులు, బడుగు బలహీన వర్గాల సమస్యలన్నీ పరిష్కరిస్తాం. ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం' అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజలకు సేవచేసే నేతలకు అవకాశాలు ఇవ్వాలని కోరారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్సీ కవితను ఓడించిన విధంగానే ప్రస్తుతం ఎంపీ అర్వింద్‌ను కూడా ఓడించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో అన్ని సాగునీటి ప్రాజెక్టులను కట్టించింది కాంగ్రెస్ పార్టీనే అని అన్నారు. వైద్య కళాశాల, ఇతర కళాశాలను కాంగ్రెస్ హయాంలోనే ఏర్పాటయ్యాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రైతులకు న్యాయం జరిగిందన్నారు. ప్రత్యేక తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను కాదని టీఆర్ఎస్‌కు రెండు దఫాలు అవకాశం ఇచ్చారన్నారు. ఈ దఫా ఒకసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ అవకాశం ఇస్తే ఇందిరమ్మ రాజ్యం వస్తుందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో జిల్లా సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. రైతులకు అండగా ఉం టామన్నారు. మైనార్టీల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు నిరుద్యోగ యువకులను ఆదుకుంటామని తెలిపారు. ప్రజలందరూ ఆలోచించి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కామారెడ్డి నియోజకవర్గం పరిధి నుంచి తరలివచ్చి కార్నర్ మీటింగ్‌ను విజయవంతం చేశారు. పాదయాత్రలో అన్ని వర్గాల నేతలు పాల్గొనడంతో పాటు సమన్వయంతో నేతలందరూ కలిసివచ్చి విజయవంతం చేశారు. రేవంత్‌రెడ్డి చేపట్టిన పాద యాత్ర జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపింది. ఆరు రోజుల పాటు ఐదు నియోజకవర్గాల పరిధిలో జరిగిన ఈ పాదయాత్రలో కాంగ్రెస్ నేతలతో పాటు వివిధ సంఘాలు, నేతలు పాల్గొన్నారు. నియోజకవర్గాల పరిధిలో పలు ప్రాంతాలను సందర్శించారు. సమస్యలు తెలుసుకున్నారు. వారిలో భరోసా నింపే ప్రయత్నం చేశారు. ఆయా ప్రాంతాలను పరిశీలించిన మీదట కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపేవిధంగా పాదయాత్రలో పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ వర్గాలకు విజ్ఞప్తు లు చేయడంతో పాటు కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. అధికార పార్టీ ఎమ్మెల్యేల పనితీరుతో పాటు ప్రభుత్వ పథకాలపై విమర్శలు చేశారు. కాంగ్రెస్ క్యాడర్‌కు దిశా నిర్దేశర చేయడంతో పాటు వచ్చే ఎన్నికలకు సమయాత్తం అయ్యే విధంగా మనోధైర్యం నింపారు. ఈ పాదయాత్రకు నేతలంతా కలిసి రావడంతో క్యాడర్‌లో ఉత్సాహం నెలకొంది. మాజీ మంత్రి షబ్బీర్‌అలీ ఇతర నేతలు పాల్గొన్నారు.

# ఖలిస్తాన్ నేత అమృతపాల్ సింగ్ అరెస్ట్

**మొదటిపేజీతరువాయి..**

దాదాపు 50 వాహనాల్లో వెళ్లారు. ఆయనను గుర్తించి, వెంటాడారు. చివరికి నకోదర్ సమీపంలో ఆయనను అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో పంజాబ్‌లోని అనేక జిల్లాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు విధించారు. ఈ ఆంక్షలు ఆదివారం రాత్రి 12 గంటల వరకు కొనసాగుతాయి. బ్యాంకింగ్, మొబైల్ రీఛార్జి మినహా మిగిలిన మొబైల్ ఇంటర్నెట్ సేవలు, ఎస్ఎంఎస్ సర్వీసులను నిలిపివేయాలని ఆదేశించారు. కేవలం వాయిస్ కాల్స్ మాత్రమే అనుమతిస్తారు. ప్రజాభద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పంజాబ్ హోం వ్యవహారాలు, న్యాయ శాఖ విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. అమృత్ పాల్ సింగ్, ఆయన అనుచరులు గత నెలలో అజ్నాలా పోలీస్ స్టేషన్‌లోకి దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. వీరంతా ఆయుధాలను గాలిలో తిప్పుతూ భయానక పరిస్థితులను సృష్టించారు. వీరి దాడిలో కొందరు పోలీసులు గాయపడ్డారు. అల్లర్ల కేసులో అరెస్టయిన తమ అనుచరుడిని వదిలిపెట్టాలని వీరంతా డిమాండ్ చేశారు.

# కించపరిచేలా మాట్లాడలే

**మొదటిపేజీ తరువాయి..**

వివరణ ఇచ్చారు. అనుకోకుండా చేసిన వాఖ్యలు తప్ప ఎలాంటి దుర్దేశరతో చేయలేదని, అన్ని వ్యాఖ్యలను ఉద్దేశపూర్వకంగా చేయలేదంటూ బండి సంజయ్ సంజాయిషీ ఇచ్చుకున్నట్లు సమాచారం. ఇటీవల చేసిన వ్యాఖ్యల్లో కవితను తాను అక్కగా సంబోధించనట్లు కమిషన్‌కు చెప్పినట్లు తెలియవచ్చింది. మహిళలపై మరోసారి సామెతలను ప్రయోగించొద్దంటూ కమిషన్ ఆదేశించినట్లు సమాచారం. ఇంకోసారి ఇలా మాట్లాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు విశ్వాసనీయ సమాచారం. ఎవరైనా మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తే.. కఠిన చర్యలు తప్పవంది. కాగా మరొకసారి బండి సంజయ్‌ని కమిషన్ విచారించే అవకాశం ఉన్నట్లు తెలియవచ్చింది.

## పేపర్ లీకేజీలో

# బండి సంజయ్ హస్తం

### చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్ కొత్త వాదన

కరీంనగర్,మార్చి18(ప్రజామంటలు): టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ వెనుకాల ప్రధానంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ హస్తం ఉందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వాన్ని బద్‌నామ్ చేయడానికి ఆయనే ఈ పని చేసి ఉండారని అనుమానం ఉందన్నారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని బూరుగుపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బండి సంజయ్ పచ్చి అవకాశవాది అని, తన స్వార్థ ప్రయోజనాల కోసం యువతను రెచ్చగొడుతున్నారని



ధ్వజమెత్తారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో నిందితులంతా బీజేపీ కార్యకర్తలే అని ఆయన పేర్కొన్నారు. ధరణి పోర్టల్ వల్ల తెలంగాణ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న అక్కసుతోనే సంజయ్ అబద్ధపు ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మతం పేరుతో యువత జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని, ప్రభుత్వ పనితీరు, వ్యవస్థపై బండికి కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ అనేది స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ సంస్థ అని గుర్తు చేశారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నది, రాష్ట్రానికి కంపెనీలను తీసుకువచ్చి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నది మంత్రి కేటీఆర్ అని స్పష్టం చేశారు. బండి సంజయ్ చిల్లర రాజకీయాలు చేస్తూ యువతను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తే ప్రజలు తరిమికొట్టే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు.

# సింగరేణి నుంచి నేటి వరకు లీకేజీలే

### విద్యామంత్రి ఉండగా కెటిఆర్ ఎందుకు మాట్లాడాలి

### మడియాతో పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి

నిజామాబాద్,మార్చి18(ప్రజామంటలు): టీఎస్ పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారంలో రోజుకో నాటకం ఆడుతు న్నారని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి విమర్శించారు. కేటీఆర్ రివ్యూ మీటింగ్‌కు సిట్ అధికారుల్ని ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. తనకు సంబంధం లేందంటున్న కెసిఆర్ విద్యాశాఖమంత్రితో మాట్లాడించకుండా ఆయనే ఎందుకు చెప్పారనిరేవంత్ ప్రశ్నించారు. పేపర్స్ లీక్ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దలను కాపాడు తున్నారని రేవంత్ ఆరోపించారు.

కేటీఆర్ కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని చెప్పారు.సిట్ చెప్పకుండానే ఇద్దరు నిందితులని కేటీఆర్ ఎలా చెప్పారని ప్రశ్నించారు. 9 మందిని అరెస్ట్ చేస్తే ఇద్దరే నిందితులని ఎలా అవుతారని ప్రశ్నించారు. అసలు పేపర్ లీక్ వ్యవహారానికి



ఐటీ మంత్రికి సంబంధం ఏంటని రేవంత్ ప్రశ్నించారు. పేపర్ లీక్ కేసులో ఒక నిందితుడు బీజేపీ క్రియాశీలక కార్యకర్త అని ఆరోపించారు. తెలంగాణ మోడల్ అంటే మినిమమ్ గవర్నెన్స్ మ్యాగ్జిమమ్ పాలిటిక్స్ అని అన్నారు. దేశంలో పార్టీ విస్తరణపై కేసీఆర్ దృష్టి పెట్టారని.. ఎగ్జామ్స్ రద్దు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రానికి బాధ్యతారహిత నేత సీఎం అయ్యిండని ధ్వజమెత్తారు. కేసీఆర్ ప్రజలను పశువుల కంటే హీనంగా చూస్తున్నారని అన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక వచ్చిన ప్రతీ నోటిఫికేషన్ లో గందరగోళమేనని రేవంత్ చెప్పారు. 2015 లో సింగరేణి నియామకాల్లో అవకతవకలు, 2016 ఎంసెట్ పరీక్ష పేపర్ లీక్ .. మళ్లీ 2017 లో సింగరేణి నియామకాల్లో ప్రశ్నాపత్రాలు లీక్ ,2019లో ఇంటర్ ఎగ్జామ్ పేపర్స్ దిద్దడంలో లోప భూయిష్టం ఇలా అన్నింట్లో ప్రభుత్వ వైఫల్యం బయటపడిందన్నారు. ఇంటర్ ఎగ్జామ్ పేపర్ దిద్దడంలో 60 వేల తప్పులు దొర్లాయని ప్రభుత్వమే చెప్పిందని.. దీని వల్ల 27 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని రేవంత్ వెల్లడించారు.

# పేపర్ లీకేజీ ఘటనపై ఆందోళన

### రాష్ట్ర వ్యాప్తంగా శ్రేణుల నిరసనలు

### అభ్యర్థులకు లక్ష చొప్పన పరిహారం చెల్లింపునకు డిమాండ్

హైదరాబాద్,మార్చి18(ప్రజామంటలు): టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనపై నిరుద్యోగులు, విద్యార్థులకు సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని బీజేపీ శ్రేణులు డిమాండ్ చేశారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ కేసుకు బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలన్నారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా బిజెపి నిరసనలకు దిగింది. జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ముందు బీజేపీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. బీజేపీ నాయకులు తుల ఉమ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడికి ప్రయత్నించారు. కలెక్టరేట్ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకి బీజేపీ శ్రేణులు ప్రయత్నించారు. దీంతో బీజేపీ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా గ్రూప్ 1 అభ్యర్థులకు లక్ష రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీకు నిరసనగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్ను ముట్టడించేందుకు బీజేపీ నాయకులు ప్రయత్నించారు. కలెక్టరేట్ వద్దకు చేరుకున్న బీజేపీ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు, బీజేపీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. దీంతో స్థానికంగా ఉద్రిక్తత ఏర్పడింది. దీంతో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, అధికార ప్రతినిధి రాకేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ధర్మారావుతో పాటు పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీకి నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించింది. లీకేజీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పార్లమెంట్ బీజేపీ ఇంఛార్జ్ బి. ప్రవీణ్ రావు డిమాండ్ చేశారు. లక్షలాది మంది నిరుద్యోగులతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుకుంటోందని ఆరోపించారు. పేపర్ లీకేజీ ఘటనకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం, పబ్లిక్ కమిషన్ ఛైర్మెన్ కు వ్యతిరేకంగా శంషాబాద్‌లో బీజేపీ ధర్నా చేపట్టింది. స్థానిక బస్టాండ్ వద్ద బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు ఆందోళనకు దిగారు. పేపర్ల లీక్ కు నిరసనగా జనగామ కలెక్టరేట్ ముట్టడికి బీజేపీ నాయకులు యత్నించారు. బీజేపీ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువురి మధ్య తోపులాట జరిగింది. దీంతో బీజేపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. అటు పేపర్ లీకేజీ ఘటనపై మంచిర్యాల జిల్లా బీజేపీ నాయకులు భగ్గుమన్నారు. మంచిర్యాల కలెక్టరేట్ను బీజేపీ కార్యకర్తలు ముట్టడించారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా..పోలీసులను తోసేసి లోపలికి చొచ్చుకెళ్లారు. దీంతో బీజేపీ నాయకులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ ఘటనలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్టి వెంకటకృష్ణ చేయి విరిగింది. బీజేపీ నేతల ఆందోళనతో కలెక్టరేట్ ఆవరణలో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది.




# పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ రాజీనామా చేయాలి

### ఓయూలో ఉధృతంగా విద్యార్థుల ఆందోళన

హైదరాబాద్,మార్చి18(ప్రజామంటలు): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్ పై రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు బోర్డు తీరుపై విమర్శలు వస్తున్నాయి. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్ధన్ రెడ్డి రాజీనామా చేయాలనే



డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి. ఉస్మానియా యూనివర్శిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద విద్యార్థులు నిరసన దీక్ష చేపట్టారు. పేపర్ లీకేజీ ఘటనలో చైర్మన్ జనార్ధన్ రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ బోర్డును సైతం రద్దు చేయాలని, పేపర్ల లీకేజీ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేస్తూ.. ఉస్మానియా యూనివర్శిటీ లైబ్రరీ నుండి లా కళాశాల వరకూ వామపక్ష విద్యార్థి సంఘాల నాయ కులు భారీ ర్యాలీ నిర్వహించారు. బోర్డును ప్రక్షాళన చేసి, ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఓయూ లైబ్రరీ నుండి లా కళాశాల వరకు భారీ ర్యాలీ చేపట్టి.. అక్కడే బైఠాయించి.. నిరసన తెలిపారు. ఓ విద్యార్థి గుండు గీయించుకుని.. తనదైన స్టైల్లో రోడ్డుపై నిరసన తెలిపాడు.

# ములుకనూరు ఎస్సైగా మహేందర్ బాధ్యతల స్వీకరణ



**భీమదేవరపల్లి మార్చ్ 18 (ప్రజామంటలు) :** మండలంలోని ముల్కనూర్ సబ్ ఇన్స్పెక్టర్ గా ఎం. మహేందర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్సై ప్రవీణ్ కుమార్ బదిలీపై విఆర్ కి వెళ్లారు. వరంగల్ మట్టవాడలో విధులు నిర్వహిస్తున్న మహేందర్ కు ములకనూరు లో పోస్టింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

# బొమ్మ వెంకన్న 4వ వర్ధంతి

**భీమదేవరపల్లి మార్చి 18 (ప్రజామంటలు):** మండలంలోని ములుకనూర్ అంబేద్కర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే, కీ.శే. బొమ్మ వెంకన్న 4వ వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి



బీజేపీ సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, గండు సారయ్య, మండల ఉపాధ్యక్షులు గంప సురేష్, మహిళ మోర్చా అధ్యక్షురాలు అంబిర్ కవిత, ఓబిసి మోర్చా అధ్యక్షులు పిల్లి రవీందర్, హనుమకొండ జిల్లా ఓబిసి మోర్చా ఉపాధ్యక్షులు ఉసకోయిల కిషన్, నోముల బిక్షపతి, మీస మహేష్, మార్పాక ప్రభాకర్, కూన శ్రీనివాస్, మాట్ల మొగిలి, దేవరాజు శంకర్, బైరి సదానందం, జినికల కేసూర్యం, దొంగల రణధీర్, దొంగల రానా, అయిత సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంఎల్ఏ బొమ్మ వెంకన్న సేవలు మరువలేనివి

### ఇందుర్తిలో వర్ధంతి వేడుకలు

**చిగురుమామిడి మార్చి 18 (ప్రజామంటలు):** మాజీ ఎంఎల్ఏ బొమ్మ వెంకన్న 4వ వర్ధంతి సందర్భంగా ఇందుర్తి గ్రామంలో ఆయన విగ్రహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంది తిరుపతిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఇందుర్తి గ్రామ శాఖ అధ్యక్షులు







చింతపూల నరేందర్, మాజీ సర్పంచ్ పుల్లూరి రాజు మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు బొడిగ పరశురాములు, మాజీ ఎంపీటీసీ బుర్ర శివ లీల, చింతపూల ఆంజనేయులు, అందే ప్రశరమలు, బాబుమియా, మైనార్టీ సెల్ అధ్యక్షులు షాబుద్దీన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరేందర్ సింగ్ మండల మీడియా అధ్యక్షులు బోయిని వేణు, యువజన కాంగ్రెస్ నాయకులు రెడ్డి యాదగిరి, కొండాపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి,సంతోష్ రెడ్డి, కొండాపూర్ ఉపాధ్యక్షులు, బుర్ర లక్ష్మణ్, డా. రాజేందర్, బుర్ర రాజయ్య, అందే రాజయ్య, చింతపూల నరేందర్, చింతపూల సాయన్న, రేకొండ గ్రామ గ%శీ%ద్రతి రామయ్య, పడాల శ్రీనివాస్, పిరల్ల రవీందర్, మంద లక్ష్మణ్, ఎండీ బాబుమియా, రాజయ్య, కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామస్తులు వివిధ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



భీమదేవరపల్లి మండలం విశ్వనాథ కాలనీలో బొడ్రాయి, హనుమాన్ టెంపుల్, దేవాలయం దర్శించుకున్న బీజేపీ నాయకులు జిల్లా కార్యదర్శి మాచర్ల కుమారస్వామి గౌడ్, పృథ్వీరాజ్ గౌడ్, వల్లెపు రమేష్ తదితరులు

# దొరతనం ఓడింది.. తానూ వీరత్వం నిలిచింది

**(మార్చి 20న తానూ నాయక్ 73 వ వర్ధంతి సందర్భంగా ఈ వ్యాసం)**

**జనగామ మార్చి 18 (ప్రజామంటలు)**

"గునపాలతో నీదు గుండెల్లో పొడిచినా
కత్తులతో చీల్చినా కుత్తుకను నులిమినా
ధీరుడిగా నిలిచావు తానూ
తెలంగాణ జ్యోతివై వెలిగావు తానూ"

అప్పట్లో ఆ గిరిజన వీరుడి త్యాగాన్ని స్మరిస్తూ ప్రజలు పాడుకునేవారు. తానూ కుటుంబం నీతీ నిజాయితీ, నిబద్ధతకు పెట్టింది పేరు. మాటిస్తే ప్రాణాలు పోయినా మాటపై నిలబడే తత్వం.. ఎవరికి ఆపదొచ్చినా వెన్నంటే నిలిచే దయాగుణం. ప్రజలను దోచుకుంటున్న భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసే ధీరత్వం. ఆ కుటంబానిది పోరాట యోధుల వారసత్వం. అందులో తానూ నాయక్, దర్మ్యా నాయక్‌లు దళకమాండర్లు. ఒడిసెలతో రాళు విసరటంలో, తుపాకీ ఎక్కుపెట్టడంలో రణధీరులు. జాటోతు మంగి, హాము దంపతులది ఉమ్మడి వరంగల్ జిల్లా ( ప్రస్తుతం జనగాం జిల్లాలో ఉంది) లోని దేవరుప్పల మండలంలోని ధర్మాపురం పడమటి తండా (ఇది పూర్వం నల్లగొండ జిల్లాలో వుండేది). పల్లె పల్లెకూ చరిత్ర ఉన్నట్టు ఆ ఊరి చరిత్ర మామూలు చరిత్ర కాదు. ఉద్యమ చరిత్ర. విప్లవానికి తొలిపొద్దు ధర్మపురం. అధర్మాన్ని ఓడించి ధర్మాన్ని నిలబెట్టింది. మంగి దంపతులకు ఆరుగురు కొడుకులు. జోద్య, సోమ్లు, సాంక్రు, దర్మ్యా, తాను, దాసు(కిషన్)లు. వీరంతా ఉద్యమం కోసం శ్రమశక్తిని మాత్రమే కాదు ప్రాణాలను ఫణంగా పెట్టారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి వేగు చుక్కలై వెలుగొందారు. నిజాం నిరంకుశ పాలనకు వంతపాడుతూ...ప్రజల భూములను లాక్కుంటూ, మానప్రాణాలతో చెలగాటమాడే రామచంద్రారెడ్డి ఊరు విసునూరుకు ధర్మపురం పడమటి తండా పది, పన్నెండు కిలోమీటర్ల దూరంలో వుండేది. ధర్మపురం భూస్వామి రాఘవరావు పెద్ద భూస్వామి. విసునూరు దొరలాగే ప్రజల్ని పీడించేవాడు. పడమటి తండాలో గిరిజనులకు చెందిన భూమిపై దొర కన్నుపడింది. సారవంతమైన భూముల్ని లాక్కునేందుకు భూస్వామి తన అనుచరుల్ని ఆ తండా మీదికి పంపాడు. బెదిరించి లాక్కోవాలని చూశాడు. దీనికి హాము కుటుంబం అడ్డుగా నిలిచింది. దొర అకృత్యాన్ని తిప్పికొట్టింది. దీంతో భూస్వామికి హాము కుటుంబం కంట్లో నలుసై కూర్చుంది. పక్కనే ఉన్న రామారం గ్రామానికి చెందిన బ్రాహ్మణుడి భూములవీ. నయానో భయానో ఆ బ్రాహ్మణుడి నుండి లాక్కున్నప్పటికీ గిరిజనులు మాత్రం ఆ భూముల్లోనే ఉన్నారు. వ్యవసాయంపై అధార పడి జీవిస్తున్న గిరిజనులు భూమిని వదులుకునేందుకు సిద్ధంగా లేరు. చావో.. రైవో.. తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. అక్కడి గిరిజనుల్ని సంఘటితం చేయడంలో హాము కుటుంబానిదే ప్రధాన పాత్ర. తండాపై దాడికి తెగబడిన దొర అనుచరుల్ని ప్రతిఘటించి వెనక్కిపంపారు. ఇది దొరకు తలవంపు ఘటనే! ఈ గ్రామంలో ప్రతిఘటనోద్యమం మొదలయ్యేనాటికి ఎర్రజెండా ఆంధ్రమహాసభ రూపంలో గ్రామాల్లోకి విస్తరిస్తోంది. ఆ సంఘం మహాసభలు గిరిజన బిడ్డల్ని పోరాటం వైపు మళ్లించాయి. ఆ వెలుగులోనే పడమటి తండాలో ఎర్రజెండా రెపరెపలాడింది. సంఘం అగ్ర నాయకులు ఆరుట్ల రాంచంద్రారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు లాంటి ముఖ్య నాయకులు ఆ గ్రామంలో పర్యటించారు. 'భూస్వామి కుట్రలకు వ్యతిరేకంగా నిలబడండి. అండగా మేముంటాం' అంటూ భరోసానిచ్చారు. దీంతో భూస్వామి రాఘవరావు ఆగడాలకు అడ్డుకట్ట పడింది. పోరాటం తీవ్రరూపం దాల్చడంతో ఆ కుటుంబానికి చెందిన హాము కొడుకులు ఆరుగురూ ఉద్యమం వైపు నిలబడ్డారు. తాను, దర్మ్యా నాయక్‌లు ఉద్యమంలో ముందు పీఠిన నిలిచారు. ఆ తండాపై పోలీసులు, దొరలు, రజాకార్లు కక్ష గట్టి దాడులు జరిపినా తాను, దర్మ్యా మాత్రం వెనుకడుగు వేయలేదు. విసునూరు నుంచి పోలీస్ బలగాలతో దేశ్‌ముఖ్ కొడుకు బాబుదొర తండాపై దాడి చేశాడు. నల్లగొండ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి, జిల్లా కలెక్టర్ సమక్షంలో గిరిజనుల్నీ, తాను తల్లిదండ్రులనూ చిత్ర హింసలు పెట్టారు. కొడుకుల జాడ చెప్పాలని, కమ్యూనిస్టు నాయకుల్ని పట్టించాలని వేధించిప్పటికీ సమాచారం మాత్రం చెప్పలేదు. ఇక విసిగిపోయిన ముష్కరులు హాము చేయిని విరగ్గొట్టారు. ఇండ్లలోని వస్తువులనూ, నిల్వ చేసుకున్న పంటనూ దోచుకున్నారు. తండాకు నిప్పు పెట్టి





కాల్చేశారు. మరో రోజు రజాకార్లు పెద్ద ఎత్తున తండాను ముట్టడించి క్యాంపు పెట్టించారు. మహిళలను చెరబట్టాలని ప్రయత్నించిన, పోలీసులపైనా, రజాకార్లపైనా హాము కోడలు జాటోతు పూలీ (జోద్యా భార్య) తిరగబడింది. మరి కొందరు మహిళల సహాయంతో రజాకార్ల కండ్లల్లో కారంపొడి చల్లి, కొడవండ్లతో దాడి చేశారు. రోకలి బండలందుకుని తరిమికొట్టారు. దళకమాండర్‌గా ఉన్న తానూను పట్టుకునేందుకు మరోసారి తండాపై దాడి చేశారు. భూస్వాములంతా మూకుమ్మడిగా వచ్చారు. కమ్యూనిస్టు కేంద్రాలపై దాడులు చేయించారు. పోలీసుల్ని, రజాకార్లను ఉసిగొల్పారు. కేసులు పెట్టించారు. జోద్యా, సాంక్రులను అక్రమ కేసుల్లో ఇరికించి జైలుకు పంపారు. తానూ, దర్మ్యాను పట్టించాలని బాబుదొర తండా ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాడు. చిత్రహింసలు పెడుతూ మహిళలను వేధించారు. హాము రెండో కొడుకు జాటోతు సోమ్లా (తానుకు రెండో అన్న) పోలీసులకు దొరికాడు. అప్పటికే కాలి బూడిదైన గూడాన్ని పునర్నిర్మాణం చేసేందుకు కట్టెలు, కావాల్సిన దూలాలు సమకూర్చుకున్నారు. ఆ కర్రలతోనే తల్లిదండ్రుల కండ్లెదుటే మరో నలుగురిని కలిపి తండా వాసులతో బలవంతంగా చితిపేర్పించారు. బంధించిన నల్గురినీ తాళ్లతో కట్టి చితిపై పడుకోబెట్టారు. అయినా కమ్యూనిస్టుల జాడను గానీ, తానూ వివరాలను గానీ వారు చెప్పలేదు. దీంతో గిరిజనుల కండ్లెదుటే సోమ్లా, జాటోతు రెడ్యా, ఆజ్మీరా బలరాం, చెంద్రు, రాము, బోడ గోల్యా, తావుర్యా, దారవత్ కిషన్‌లను సజీవ దహనం చేశారు. ఇందులో ఇద్దరిని దగ్గర్లో వున్న గుట్టల వద్ద కాల్చి చంపారు. 'వారిని పట్టించినా వీరిని వదలరు. అందరినీ కలిపి చంపేస్తారు' అని భావించి, కళ్లెదుటే కన్న బిడ్డలు మంటల్లో కాలిపోతుంటే మెదపకుండా మొక్కవోని ధైర్యంతో వున్నారు. వృద్ధాప్యంలో ఉన్న వాళ్లంతా గుండెలవిసేలా ఏడ్చారు. 'తండాను శ్మశానంగా చేస్తాం' అని దొర అన్న మాటలతో తండావాసుల్లో ఇంకా కసి పెరిగింది. దొరకు వ్యతిరేకంగా కలిసికట్టుగా ముందుకెళ్లేందుకు గూడెం మొత్తం దృఢనిశ్చయంతో కదిలింది. జూలై 4 న విసునూరు దేశ్‌ముఖ్ గుండాలు జరిపిన కాల్పుల్లో దొడ్డి కొమరయ్య వీరమరణం పొందాడు. ఈ విషయం తెలిసి తానూ నాయక్ ముందుగా కడివెండికి చేరుకున్నాడు. ఆ గుండాలపై తానూ కొదమ సింగమై ప్రతి దాడి చేశాడు. ఆ తర్వాత తానూ నాయక్ విసునూరు, మొండ్రాయి, కడవెండి ఆ చుట్టు పక్కల గ్రామాల్లోని భూస్వాముల ఇండ్లపై దాడులు జరిపాడు. పోలీసుల కాల్పుల నుండి తప్పించుకున్నారు. బాబు దొర చేయని ప్రయత్నమంటూ లేదు. మొండ్రాయిలో గిరిజనుల భూముల్ని భూస్వామి కడారి నర్సింహరావు, రామచంద్రారావు లాక్కుంటుంటే వారికి వ్యతిరేకంగా ఉద్యమించారు. అక్కడే దొర రైస్‌మిల్లుపై దాడి చేసి ధాన్యాన్ని ఎత్తుకెళ్లారు. పోలీసు క్యాంపులపై దాడులు చేసి ఆయుధాలు ఎత్తుకెళ్లారు. మరో దళనాయకుడు, ఆ ఏరియా నాయకుడు యర్రంరెడ్డి మోహన్‌రెడ్డిని కుట్ర చేసి పోలీసులు పట్టుకెళ్లి పోలీస్ క్యాంప్ లో బంధించారు. ఎలాగైనా మోహన్‌రెడ్డినే తీసుకురావాలని లక్ష్యంతో తాను నాయక్ దళం ఆ పోలీస్ క్యాంప్ ముట్టడించి మోహన్‌రెడ్డిని తీసుకెళ్లారు. తానూ ప్రసంగాలకు గిరిజనులు ఆకర్షితులై ఉద్యమంలో చేరేవారు. తానూ పెద్దన్న కొడుకు జనార్థన్ చిన్న పిల్లవాడైనా పోరాటంలో ముందున్నాడు. తానూ తమ్ముడూ దర్మ్యా నాయక్ దళకమాండర్‌గా నల్లా నర్సింహులు కుడి భుజంగా పని చేశాడు. జనగాంలో విసునూరు దేశ్‌ముఖ్ బాబుదొరను చంపడంలో దర్మ్యా నాయక్‌ది కీలక పాత్ర. దర్మ్యాకు వేసిన ఉరి శిక్ష యావజ్జీవ శిక్షగా మారింది. ఈ ప్రాంతంలో తానూ నాయక్ కమ్యూనిస్టుల బలోపేతానికి పునాది వేశాడు. గిరిజన గుడాలన్నింటినీ కమ్యూనిస్టు కేంద్రాలుగా మార్చడంలో తానూ కృషి ఉంది. పోలీసులు, రజాకార్ల నుంచి ఎన్నోసార్లు తప్పించుకున్న తాను నాయక్ మొండ్రాయి దగ్గర నీలిబండ తండాలో మార్చి 20, 1950న పోలీసు బలగాలకి చిక్కాడు. అతడిని దొర గడీలో బంధించి చిత్ర హింసలు పెట్టారు. ఎంత హింసించినా మొక్కవోని ధైర్యంతో వున్నాడు తానూ. నల్లా నర్సింహులు, యర్రంరెడ్డి మోహన్‌రెడ్డి, చకిలం యాదగిరిరావు, నరహరిలతో పాటు ముఖ్య నాయకుల్ని పట్టిస్తే వదిలేస్తామని, కేసుల్లేకుండా చేస్తామని చెప్పినా నాయకుల్ని పట్టించేందుకు తానూ నిరాకరించాడు. పోలీసులు సైతం తానూ ధీరత్వాన్ని చూసి ఆశ్చర్యపోయారు. దొరల ఒత్తిడితో బండి చక్రానికి కట్టి తానూ నాయక్‌ను తూపాకితో కాల్చిచంపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో తానూ కుటుంబం మొత్తం ఎన్నో ఒడిదిడుగులకు లోనైంది. ఉద్యమం కోసం కుటుంబమంతా త్యాగం చేసి చరిత్రలో నిలిచారు. వారి త్యాగాన్ని చరిత్రెప్పుడూ విస్మరించదు. వారెప్పుడూ అజేయంగా.. ఉద్యమ తొలిపొద్దులా.. నిలుస్తూనే ఉంటారు. తానూ నాయక్ తమ్ముడూ జాటోతు దర్మ్యానాయక్ వందేండ్లు నిండి (107) నేటికి మన కండ్ల ముందు సజీవ సాక్ష్యంగా ఉద్యమ ప్రతిరూపంగా ఉన్నాడు.

మామిండ్ల రమేష్ రాజా
రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్
సెల్: 7893230218

# జిల్లా స్థాయి ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సమావేశం

**జనగామ మార్చి 18 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఎస్సీ/ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డిసిపి సీతారాం, సంబంధిత అధికారులు, మెంబర్స్ తో కలిసి కలెక్టర్ సి.హెచ్. శివలింగయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సభ్యులు డాక్టర్ రాజమౌళి, టి.వెంకటస్వామి, సత్యనారాయణ, రాగల్ల ఉపేందర్, తదితరులు తెలిపిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ క్యాస్ట్, షెడ్యూల్ ట్రైబల్స్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగానే అనేక పథకాలు ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. జిల్లాలో వారికి సంబంధించిన భూ సమస్యలు, విద్యా, సమస్యలు ఎస్సీ/ఎస్టీ కేసుల నష్టపరిహార విషయాలలో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వసతి గృహాలలో మెనూ ప్రకారం భోజనాలు సిద్ధం చేయాలని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, పిల్లలతో కలిసి భోజనం చేయాలన్నారు, బెస్ట్ అవైలబుల్ స్కీం, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లలో సీట్లు పెంచుటకు, ఎస్సీ ,ఎస్టీ స్టడీ సర్కిల్ కోసం ప్రభుత్వానికి లేఖ రాస్తామని అన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తామని, ప్రతినెల చివరి వారంలో సివిల్ రైట్ డే నిర్వహించాలని సంబంధిత



అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కొర్నియేలేస్, పిపి రమేశ్, డీఈవో కే. రాము,డిసిఓ కిరణ్ కుమార్, డిఎం సివిల్ సప్లై సంధ్యారాణి, ఏసిపిలు దేవేందర్ రెడ్డి, రవి చందర్, శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 'లీకేజీల ఖరీదు'

**(కవిత)**



సంవత్సరాల తరబడి
వెన్నుముకను వంచి
ఒక్కో పుస్తకాన్ని మస్తిష్కం
లో నింపుకొన్న నికార్సైన
కష్టం ఖరీదు
పిడికెడు పోస్టులకు
కొండంతగా శ్రమిస్తు
ఒకవేళ అందని ద్రాక్షలా
మిగిలిపోతే అన్న
ఆలోచనకు
ఉలిక్కిపడ్డ హృదయం
ఖరీదు
సంపాదన లేక వెక్కిరిస్తున్న
సంసారాన్ని ఓ వైపు
పుస్తకంతో మరోవైపు
వేదనతో లాగుతున్న
బ్రతుకు బండి ఖరీదు
పండుగలను పబ్బలను
సోపటిగండ్ల సరదాలను
కన్నవారి కష్టాలను
బంధువుల అనుబంధాన్ని
పంచుకోలేని ఖరీదు
వయసుడిగి మరణిస్తున్న
మెదడు కణాల సంఖ్యతో
లెక్కలేస్తు వెనకబడిన
రీజనింగ్ ఎబిలిటీ ఖరీదు
కన్నోల్ల కన్నీళ్ళ
అవిరైన ఆశలు
వెచ్చించిన కాలం
కోల్పోయిన సంపాదన
తిరిగి ఇచ్చేలా కట్టండి
మీ లీకేజీల ఖరీదు....

రచన:
పెట్లోజు సోమేశ్వరాచారి
అధ్యక్షులు,
కవి హృదయం సాహిత్య వేదిక,
జనగామ.

### గ్రామ బాలల పరిరక్షణ

# కమిటీ శిక్షణ కార్యక్రమం

**సైదాపూర్ మార్చి 18 (ప్రజామంటలు):** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల రాముల పల్లె గ్రామంలో బాలల పరిరక్షణ కమిటీ కార్యకర్త ఎం. రమేష్ నిర్వహించారు కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్, పంచాయితీ సెక్రెటరీ, ఆశ కర్తలు పాల్గొన్నారు . మహిళలు పిల్లల, వికలాంగుల మరియు వయోవృద్ధుల శాఖ, మరియు జిల్లా బాలల సంరక్షణ విభాగం అధ్వర్యంలో నిర్వహించారు. ఈ





సందర్భంగా బాలల పరిరక్షణ కమిటీ కార్యకర్త అయిన ఎం రమేష్ ఈ రోజున సమాజంలో జరిగే మహిళల పట్ల మరియు బాలికల పట్ల ఎలాంటి జరుగుతున్నాయో మనమంతా టీవీలలో పత్రికలలో చూస్తూనే ఉన్నాం, అందుకని సమాజంలో మహిళ ఎలా బ్రతకాలో సమాజంతో ఎలా పోరాడాలో వికలాంగులైన మహిళలు వృద్ధులు అందరికీ ఈ యొక్క అవగాహన సదస్సు ద్వారా తెలియపరచడమే మా యొక్క ముఖ్య ఉద్దేశమని దీనికి సహకరించినటువంటి ఆశ కార్యకర్తలకి , రాముల పల్లె సర్పంచి, పంచాయతీ సెక్రెటరీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

### మర్రి వద్ద....మర్రి చెట్లు నాటిన

# ఫ్రెండ్స్ స్టార్ యూత్

**కోరుట్ల మార్చి 18 (ప్రజామంటలు):** మండలంలోని పైడిమడుగు గ్రామంలోని భక్తుల మర్రి వద్ద ఫ్రెండ్స్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో మర్రి మొక్కలను నాటారు. అయిదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మర్రి వద్ద



మొక్కలను నాటితే మర్రి చెట్టు దట్టంగా అవుతుందని, ఆసియా ఖండంలోనే రెండవ అతి ఎక్కువ విస్తరణలో ఉన్న ఈ మర్రిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి బాధ్యతగా మొక్కలు నాటామని యూత్ సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దమ్మ భీమారెడ్డి, ఫ్రెండ్స్ స్టార్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్

**జగిత్యాల మార్చి 18 (ప్రజామంటలు):** జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జగిత్యాలకు చెందిన డా. తోడేటి శ్రీకాంత్ గౌడ్ ను నియామిస్తు జాతీయ అధ్యక్షులు జాజాల శ్రీనివాస్ గౌడ్ శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... బిసిల సమస్యల నిరంతర పరిష్కారానికి నిరంతర కృషి చేయాలని సూచించారు. బిసిల సమస్యల పరిష్కారామే లక్ష్యంగా పనిచేస్తానని తన నియామకానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి గాజుల నాగరాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఓరుగంటి భార్గవ్ రామ్, జగిత్యాల జిల్లా కార్యదర్శి శంకర్, తెలంగాణ రాష్ట్ర మహిళా నాయకురాలు, తదితరులు పాల్గొన్నారు.



# సత్యాలను అంగీకరించలేని బిజెపి!

గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తుడుముకోవడం బిజెపికి అలవాటుగా మారింది. సత్యాలను కూడా అంగీకరించలేని స్థితికి ఆ పార్టీ చేరింది. విలువలతో కూడాని రాజకీయాలు నెరిపే బిజెపికి ఇప్పుడు అసత్యాలు మాట్లడడమే అలవాటుగా చేసుకుంది. ఎందుకంటే విలువలు కలిగిన నేతలను పార్టీలో దూరంగా పెట్టారు. కనీసం వారికి మర్యాద ఇచ్చి మాట్లాడే స్థితిలో కూడా లేరు. అందుకే పార్టీలో అన్నీ అవలక్షణాలు చోటుచేసుకున్నాయి. కేవలం ఇద్దరి చేతుల్లోనే పార్టీ ఉంది. వారిద్దరే అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు. కార్పోరేట్ల సలహాలతో వారు చెప్పిన రీతిలోనే పాలన సాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తాము చెప్పిందే వేదం అన్న రీతిలో పార్టీని నడుపుతూ ప్రజల ఉసురు పోసు కుంటున్నారు. అన్నీ ఘనతలు సాధించామని, భారత్ ఉజ్వలంగా ఉందని గొప్పలకు పోతున్నారు. ఇలాంటి వారికి ఎదుటి వారు చెప్పే నిజాలు చేదుమాత్రగానే ఉంటుంది. దేశంలో నిరుద్యోగం 45 ఏళ్ల గరిష్ఠానికి చేరింది. సమస్యలపై గొంతుచించుకుని అరిచినా వినిపించుకునే స్థాయిని మోడీ దాటిపోయారు. నిరుద్యోగం పెరిగిందని, ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీస్తున్నా సమాధానం ఇచ్చే ధైర్యం మోడీకి లేదు. విపక్ష పార్టీలు నిజాలు అడిగినంతనే బిజెపి అగ్గిమీద గుగ్గిలం కావడం దాని అసహనాన్ని వెల్లడిస్తోంది. ఎనిమిదేళ్ల పదవీ కాలంలో చేతగాని నిర్ణయాలు తీసుకుని దేశప్రజలను అగాథంలోకి నెట్టిన మోడీ బృందానికి సహజంగానే విమర్శలను జీర్ణించుకునే స్థాయి లేదు. ఉద్యోగ కల్పనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విఫలమయ్యారని గణాంకాలే వెల్లడిస్తున్నా ఒప్పుకునే ధైర్యం చేయడం లేదు. దీనికితోడు ఉన్నప్రభుత్వరంగ సంస్థలను నిస్సిగ్గుగా అమ్ముతున్నా..గట్టిగా నిలదీసే నేతలు బిజెపిలో కూడా లేరు. అంతెందుకు పార్లమెంటులో ఏ సమస్యపైనా చర్చించే ధైర్యం కూడా మోడీ చేయడం లేదు. అసలు తమను పట్టించుకున్న పాపాన పోవడం లేదని అన్ని వర్గాలు వాదిస్తున్నా పట్టించు కోవడం లేదు. ఎన్నికల ముందు, పార్లమెంటు సమావేశాల సందర్భంగా నీతి వాక్యాలు చెప్పడంతప్ప సమస్యల కోణంలో చూడడం లేదు. కేంద్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయే రంగాల్లో ఎలాంటి సానుకూల మార్పులు తీసుకు వచ్చిందీ చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసు కోవడం లేదు. రాష్ట్రాలకు ఒరగబెట్టిందీ ఏమీ లేకున్నా గణాంకాలతో



వివరించేందుకు పదేపదే ప్రయత్నాలు చేయడంతప్ప మరేమీ లేదు. పెద్దనోట్ల రద్దు నిర్ణయం లక్షలాదిమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బతీసింది. చాయ్ అమ్మానని గొప్పుల చెప్పే ప్రధాని మోడీ,గ్రామాల్లో చాయ్ అమ్మేవాళ్లకు కూడా కష్టకాలం తీసుకుని వచ్చారు. ఎంతోమంది ఆర్థిక వేత్తలు, ఆర్థిక నిపుణులు పెద్దనోట్ల రద్దు వల్ల కలిగిన విపరిణామాలను ఏకరువు పెట్టినా పట్టించుకోలేదు. పలు స్వతంత్ర నివేదికలు ఇప్పటికే ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టాయి. నిజానికి ఇది ప్రతి నిరుద్యోగి చేస్తున్న ఆక్రందన. దేశంలో ఉద్యోగాలు రావు. వస్తూత్పత్తి పెరిగినా అనుబంధ రంగాలు బలపడలేదు. వ్యవసాయం దివాళా తీసింది. పండించిన పంటలకు మద్దతు ధరలు రావడం లేదు. వ్యవసాయానుబంధ పరిశ్రమలు పెట్టి నిరుద్యోగాన్ని రూపుమాపకుండా ఉపన్యాసాలతో కాలం వెళ్ల దీసారు. ఉద్యోగాలు కల్పిస్తానని, మేకిన్ ఇండియా అంటూ ఊదరగొట్టిన మోదీ వైఫల్యాన్ని కాలంగడుపుతున్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీర్చే ప్రయత్నాలు జరిగివుంటే పరిస్థితి ఎందుకింత దారుణంగా ఉంటుంది. దీనికితోడు రూపాయి విలువ పడిపోతూ, ద్రవ్యోల్బణం పెరుగుతూ పోతుందే తప్ప అభివృద్ధి గణాంకాలు ముందుకు సాగడం లేదు. పాలనలో కొత్త ఒరవడి తీసుకుని వచ్చి,ప్రజలకు ఆసరాగా అండగా, దేశానికి మంచి చేసేలా చేస్తారని మోడీని నమ్మిన ప్రజలు నిజంగానే మోసపోయారనడంలో ఏ మాత్రం సందేహం లేదు. దీనిపై బిజెపి పెద్దలు ఆత్మవిమర్శ చేసుకుంటే పార్టీకి, దేశానికి మంచిది. దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు ఎలా సన్నగిల్లాయో లెక్కలుచూస్తే తెలుస్తుంది. దేశంలోని పట్టణ ప్రాంతాల్లో 7.8శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 5.3శాతం చొప్పున నిరుద్యోగిత ఉందని, సగటున 6శాతం పైనేనని గణాంకాలు తెలుపుతున్నాయి. పెద్దనోట్లను రద్దు చేస్తూ 2016 నవంబరులో కేంద్ర సర్కారు నిర్ణయం తీసుకున్న తర్వాత అవి ఎలా సన్నగిల్లాయో తెలిపినా పట్టించు కోవడం లేదు. తీవ్రమైన ఉపాధి లేమి ఎన్నికల్లో మోదీ విజయావకాశాలను దెబ్బతీస్తుందన్నది చాలా మంది అంచనాలు వేశారు. అయితే మోడీ మేనేజ్‌మెంట్‌తో ఎన్నికల్లో గెలవడంతో ఇక తమకు తిరుగులేదన్న ధోరణిలో ఉన్నారు. స్వతంత్ర సంస్థల నోరుకట్టేసి, ప్రభుత్వ సంస్థల నివేదికలను దాచేసి, పెద్దనోట్ల రద్దు నిర్ణయంతో ఎన్నో అద్భుతాలను సాధించామని చెప్పుకున్నంత మాత్రాన ప్రజలు నమ్ముతారనుకోవడం అవివేకం. పెద్దనోట్ల రద్దు కారణం గానే ఈ దేశంలోని యువతీయువకులకు కొత్త ఇల్లు చవుకగా సమకూరు తున్నదని మోదీ స్వరాష్ట్రం గుజరాత్‌లో గొప్పలకు పోయారు. కానీ, ఈ నిర్ణయం నల్లధనాన్ని తవ్వితీయ డమనే ప్రకటిత లక్ష్యాన్ని సాధించకపోగా, నలుపును తెల్లగా మార్చి, చక్కగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది. అధికారంలోకి వచ్చేముందు కోట్లాది ఉద్యోగ ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత కొంతకాలం అవే మాటలతో మేకిన్ ఇండియా పాట కూడా పాడారు. అప్పట్లో ఆయన నోట అభివృద్ధి మాట తప్ప రామమందిరం ఊసు వినపడలేదు. తన అపసవ్య, అర్థంలేని నిర్ణయాలతో ఆర్థిక వ్యవస్థ నాశనం చేసి ఇప్పుడు ఆత్మనిర్భర భారత్ జపం చేస్తున్నారు.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్"లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

–ఎడిటర్

## మరుపు రాని కానుక

బడిలో ఏ తరగతి పిల్లలను పలకరించినా అదే విషయం. చర్విత చరణంగా వినిపిస్తూనే ఉంది. నాలుగైదు తరగతుల పిల్లలైతే ఓ లీడరును పెట్టుకుని పేర్లు కూడా రాయించుకుంటున్నారు.

అక్కడే వచ్చింది చిక్కంతా. వసంత చిన్ని జీవితంలో పెద్ద తుఫానునే తెచ్చింది. వాళ్ళందరూ కంపాస్ బాక్సు ల్లో, చొక్కాలాగు జేబుల్లో,పుస్తకాల్లో దాచుకున్నవి ఇచ్చి వసంత వైపు తల ఎగరేస్తూ చూస్తుంటే మస్తు అవమానంగా ఉంది. కానీ ఏం చేయలేని దుస్థితి. మధ్యాహ్నం బళ్లో




పెట్టిన అన్నం కూడా తినబుద్ది కాలేదు.

సాయంత్రం ఇంటికి వచ్చి పుస్తకాల సంచీ మూలకు విసిరేసింది. మోకాళ్ళ మధ్య తలకాయ పెట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

తాత గురవయ్య ఇదంతా చూసి చలించి పోయాడు. ఏం జరిగిందోనని భయపడ్డాడు.

"ఏంది బంగారూ ! ఇట్రా బిడ్డా! పిలుస్తూ మంచంలో కూసోబోయి వెనక్కి పడ్డాడు.

"ఓ తాతా! గట్టిగా అరుస్తూ

ఒక్కుదుటున లేచింది. తాతను పట్టుకుని లేపి సరిగ్గా కూచోబెట్టి పోబోతుంటే చేయి పట్టుకుని ఆపిండు.

"ఏందిరా బంగారం? ఏమైంది తల్లీ?" ఎప్పుడూ లేగదూడోలె చెంగనాలు పెట్టేదానివి.జింకపిల్లోలే ఉషారుగా తిరిగేదానివి గట్లెందుకున్నవ్? ఎవ్వరైనా కొట్టింద్రా! తిట్టింద్రా?" బుదగిరిస్తూ అడిగే సరికి వసంతకు దుఃఖం వరదలా పొంగుకొచ్చింది. భోరుమని ఏడ్చింది.

"తాతా! మా బళ్లో సుభాషిణి టీచర్ ఉజ్జోగం నుంచి దిగిపోతున్నదిగా టీచర్ చానా చానా మంచిది తాతా!

ఆ టీచరమ్మకు ఏదైనా మంచి కానుక కొనాలని అందరూ తలా కొన్ని డబ్బులేసుకుంటున్నారు.

"నేనే ఏం ఇవ్వలేదు" మళ్ళీ కళ్ళనీళ్ళు పెట్టుకుంది. మనుమరాలిని చూస్తుంటే మస్తు బాధగా అనిపించింది గురవయ్య తాతకు. తన దగ్గర డబ్బులు ఉంటే ఎంటనే ఇచ్చేటోడు.

***

వసంత అమ్మ, నాయిన రోడ్డు ప్రమాదంలో చచ్చిపోయారు. దిక్కులేని పచ్చి.పైగా ఆడపిల్ల, అనాధ అయిన వసంతను పెంచుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు.

గురవయ్య, చెంద్రమ్మ ఇద్దరూ ముందుకు వచ్చారు. కలోగంజో ఉన్నది పెట్టి సాద్దాం అనుకున్నారు.అట్ల వసంతను తెచ్చుకుని సాత్తున్నరు.

వయసు తెచ్చిన ముసలి తనం , మోకాళ్ళ నొప్పులు వల్ల గురవయ్య పనికి పోలేకపోతున్నడు.

భార్య కూలి నాలికి పోతేనే ఇల్లు గడిచేది.అలాంటి పేద బతుకు తమది.ఇగ పైసలు చేతుల ఏడ మెదుల్తయి!."

గురవయ్య బాగా ఆలోచించిండు. ఏం చేయాలో తోచలేదు. మనవరాలికి నేర్పిన కంజెర గుర్తుకు వచ్చింది. గా దాన్ని తీసుకు రమ్మని చెప్పిండు. దాన్ని మంచిగా తుడిచి శుభ్రం చేసిండు.నట్లు బిగించిండు. దాన్ని కొడుతూ ఓ పాట పాడిండు. తర్వాత సంచీలో పెట్టించి, "మనింట్లో గిదొక్కటే ఉంది తల్లీ! గిదే తీసుకుని పోయి ఇవ్వు!"అనగానే వసంతకు ఓపక్క సంతోషం, మరో పక్క గదిస్తే ఏమనుకుంటరో అని మొగమాటంగా ఉంది.

"అయినా గది తాతకెంతో ఇష్టమైన వస్తువు"ఆలోచిస్తున్న మనవ రాలితో " ఏం కాదు బిడ్డా! నువ్వు పెద్దయ్యాక ఉజ్జోగం చేసి కొనిద్దువులే" అనగానే"తప్పకుండా తాతా! మా తాత మంచోడు" అనుకుంటా సంచీని జాగ్రత్తగా పుస్తకాల దగ్గర పెట్టుకుంది.

***

మరుసటి రోజు మీటింగు జరుగుతోంది. పిల్లలు అందరూ టీచరుకు రకరకాల బహుమతులు ఇస్తుంటే చివరగా వసంత వెళ్ళింది. ముందుగా టీచరుకు, పెద్దలకు దండం పెట్టింది.

తాను తెచ్చిన కంజెర మీద తాత నేర్పిన పాటొకటి పాడింది. అందరూ చాలా బాగుందని చప్పట్లు కొట్టారు. మరో పాట "మా మంచి టీచరమ్మ/ మల్లెమనసు నీదమ్మా/ " అని మనసులోని టీచర్ మీద ఉన్న ప్రేమను, గౌరవాన్ని పాటగా అల్లి పాడింది.

అందరూ వసంత పాటను మెచ్చుకున్నారు. వచ్చిన అతిథి వసంత పాటకు ముగ్ధుడై పోయాడు. వందరూపాయల నోటు చేతిలో పెట్టాడు.

కంజరను, వంద నోటును టీచరుకు ఇస్తుంటే వాటిని తిరిగి ఇస్తూ "నీ పాటే నాకు ఎంతో అపురూపమైనది. మరుపురాని కానుకరా బంగారూ! నువ్వు మంచిగా అభ్యాసం చేస్తే గొప్ప గాయనివి అవుతావు.ఈ కంజర మీద మరిన్ని పాటలు నేర్చుకో" అంటూ దగ్గరికి తీసుకుని ప్రేమగా తల మీద చెయ్యి వేసి ఆశీర్వదించింది.

– వురిమళ్ల సునంద, ఖమ్మం

94418 15722

# కేంద్రం తీరుపై సామాన్యుల్లో అసహనం

ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు.. అన్నచందగా మారింది బీజేపీ పాలన తీరు. ఒక వైపు పప్పు, ఉప్పులు మొదలు కొని పెట్రోల్,డీజల్ ధరలను పెంచిన కేంద్ర ప్రభుత్వం మరోసారి వంట గ్యాస్ ధరను అమాంతం పెంచేసింది. ఎన్నడూ లేని విధంగా వంట గ్యాస్ సిలిండర్‌పై



రూ.50పెంచడంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. ఓ వైపు పెట్రోల్ ,డీజల్ ధరలు సెంచరీకి చేరువలో ఉండగా, గ్యాస్ ధర 1200 చేరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. సామాన్యుడి నడ్డి విరిచే విధంగా ధరలు పెంచుకుంటూ పోవడంతో ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత కొన్ని నెలలుగా కేంద్ర ప్రభుత్వం పెంచుతున్న ధరలు సామాన్య ప్రజలను నట్టేట ముంచేలా ఉన్నాయి. కొవిడ్ నేపథ్యంలో ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ప్రస్తుత తరుణంలో గ్యాస్ సిలిండర్ ధరలు గుదిబండలా మారు తున్నాయి. తాజాగా వంట గ్యాస్ సిలిండర్ రూ.50 ప్రస్తుతం సిలిండర్ ధర రూ.1155 రూపాయలకు చేరుకుంది. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు మున్ముందు మూల్యం చెల్లించుకోక తప్పదని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. మోదీ పాలనలో సామాన్య ప్రజలకు న్యాయం జరుగుతుందని అనుకున్నాం. కానీ అసలు గరీబోళ్లకే గండి పడేటట్టు ధరలు పెంచుతున్నారు. వంట గ్యాస్ ధర పెంచు కుంటూ పోతే మాలాంటి వారి పరిస్థితి ఏమిటి? కరోనా సమయంలో పనులు లేక పాయే. కూలీ పని చేసి బతుకుతున్నాం. పట్టణాలల్లో కట్టెల పొయ్యిలు పెట్టే పరిస్థితి లేదు. సీటు ఎక్కే దాక మంచి మాటలు చెప్పి, ఎక్కినంక బీజేపోళ్లు ధరలు పెంచుతున్నరు. మస్తు మంది ధరలు పెంచి, ప్రజలకు ఇబ్బంది పెట్టిన పార్టీలు, నాయకులు మళ్ల గెలువలే, ఇప్పుడు ధరలు పెంచుకుంట పోతే ఎలక్షన్లలో గుర్తు పెట్టు కొని గద్దె దించుడు ఖాయం. సామాన్య ప్రజలకు న్యాయం చేయాల్సింది పోయి, గ్యాస్ ధరను పెంచి భారం మోపుతున్నారు. రాష్ట్రంలో ఉల్లిపాయల ధర బాగా తగ్గింది. రిటైల్ మార్కెట్‌లో నాణ్యమైన లావు సైజు ఉల్లి కిలో రూ.30-36, సన్న రకం ఉల్లి రూ.25 చొప్పున అమ్ముతున్నారు. వ్యాపారుల కొనుగోలు ధర తగ్గినా, రవాణా ఛార్జీలు, తరుగుల విలువ వేసుకుని, రిటైల్ అమ్మకాలు సాగిస్తున్నారు. హోల్‌సేల్ వ్యాపారులు ఉల్లి నిల్వచేయడానికి మహారాష్ట్ర నుంచి ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నారు. ఏపీ, మహారాష్ట్రతో పాటు పలు రాష్ట్రాల్లో ఉల్లి పంట కోతకొచ్చి, కొత్త ఉత్పత్తి విరివిగా మార్కెట్‌కు వస్తోంది. కర్నూలు మార్కెట్ యార్డుకే రోజూ నాలుగైదు వేల క్వింటాళ్ల ఉల్లిపాయలు అమ్మకానికి వస్తున్నాయి. ప్రస్తుతం ఈ పంటే మార్కెట్‌కు వస్తోంది. గత ఖరీఫ్‌లో ఏపీలో 50వేల ఎకరాల్లో ఉల్లి సాగైనా, ప్రకృతి విపత్తుల వల్ల పంట దెబ్బతిన్నది. దీంతో గత నవంబరు, డిసెంబరులో ధరలు పెరిగాయి. ఒక దశలో ఉల్లి కిలో రూ.200 కూడా పలికింది. గత నెలలో రిటైల్‌గా కిలో రూ.50 దాకా ఉంది. ప్రస్తుతం ఏపీతో పాటు మహారాష్ట్రలోనూ ఉల్లి ఉత్పత్తి భారీగా మార్కెట్‌కు వస్తోంది. దీంతో ధరలు తగ్గుముఖం పట్టాయని అధికారులు చెబుతున్నారు. మరో నెల దాకా ధరల తగ్గుదల ఉంటుందని భావిస్తున్నారు.

# మాడభూషి జీవితం... నేటి తరానికి ఆదర్శం

## మార్చి 19...మాడభూషి అనంత శయనం అయ్యంగార్ వర్ధంతి

మాడభూషి అనంత శయనం అయ్యంగార్ ప్రముఖ న్యాయవాదిగా, సామాజిక కార్యకర్తగా, స్వాతంత్ర్య సమర యోధుడుగా, అత్యుత్తమ పార్లమెంటు సభ్యుడిగా, వక్తగా, విశిష్ట పండితుడిగా, లోకసభ స్పీకర్ గా, పాత తరానికి చెందిన జాతీయ నాయకులలో విశిష్ట స్థానం దక్కించు కున్నారు.

అయ్యంగార్ 1891 ఫిబ్రవరి 4న ఆంధ్రప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక



పట్టణం తిరుపతి సమీపంలో తిరుచనూరులో జన్మించారు. తిరుపతిలోని దేవస్థానం ఉన్నత పాఠశాలలో ప్రారంభ విద్యను పూర్తి చేసి, ఉన్నత చదువుల కోసం మద్రాసుకు వెళ్లారు. మద్రాసులోని పచయ్యప్ప కళాశాల నుండి బిఎ పట్టా పొందిన తరువాత, 1913 లో మద్రాస్ లా కాలేజీ నుండి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు.1912 లో గణిత విషయ ఉపాధ్యాయుడిగా నియుక్తులై, 1915లో న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించారు. స్వల్ప వ్యవధిలో, ఒక ప్రొఫెషనల్ న్యాయవాదిగా, అసాధారణ సామర్థ్యంతో ఖ్యాతిని పొందారు. జీవనోపాధిని సంపాదించే సాధనంగా మాత్రమే న్యాయవాద వృత్తిని చూడక, భారత ప్రజల అవసరాలకు అనుగుణంగా దేశ న్యాయ వ్యవస్థను మెరుగు పరచడంలో ఆసక్తి చూపారు.

అయ్యంగార్ చాలా చిన్న వయస్సులోనే స్వాతంత్ర్య ఉద్యమంలోకి ప్రవేశించారు. తన సొంత రాష్ట్రంలోనే, బ్రిటిష్ వలస వాదానికి వ్యతిరేకంగా జాతీయ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రముఖ వ్యక్తులలో ఒకరిగా ఎదిగారు. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వంలో ఉండి, పోరాడటమే లక్ష్యంగా, 1934 లో కేంద్ర శాసనసభ ఎన్నికలలో పోటీ చేయాలని నిర్ణయించు కున్నప్పుడు, అయ్యంగార్ అధిక మెజారిటీతో సభకు ఎన్నికయ్యారు. వాస్తవాలు మరియు గణాంకాలతో అతని సహజమైన చర్చా నైపుణ్యాల ద్వారా, అయ్యంగార్ త్వరలోనే అసెంబ్లీలో తన వాదనా పటిమతో తనదైన ముద్ర వేశారు.

మొదట వ్యక్తిగత సత్యాగ్రహ ప్రచారంలో తరువాత 1942 'క్విట్ ఇండియా ఉద్యమంలో' పాల్గొన్నందుకు 1940, 1944 మధ్య అయ్యంగార్ దాదాపు మూడు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు.

రాజకీయ స్వేచ్ఛ కోసం ఉద్యమంలో చురుకుగా పాల్గొనడమే కాకుండా, సమాజం లోని అణగారిన వర్గాల, సామాజిక విముక్తి దిశగా, నిర్దేశించిన వివిధ కార్యకలాపాలలో అయ్యంగార్ పాల్గొన్నారు. అంటరాని సామర్థ్యం వంటి సామాజిక చెడులతో పోరాడటానికి గాంధీజీ నిర్మాణాత్మక కార్యక్రమాల నుండి ప్రేరణ పొందిన అయ్యంగార్, హరిజనులకు ఆలయ ప్రవేశం, అంటరాని తనం నిర్మూలన కోసం ఉద్యమాలలో ముందంజలో ఉన్నారు. తరువాత, హరిజన్ సేవక్ సంఘ అధ్యక్షుడిగా తమ సామర్థ్యంలో, హరిజనుల ఆర్థిక, సామాజిక అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలను చేపట్టారు.

ఆయన మొట్టమొదటి సారిగా చిత్తూరు మున్సిపల్ కౌన్సిల్ కు ఎన్నిక అయ్యారు. తరువాత, చిత్తూరు కో - ఆపరేటివ్ డిస్ట్రిక్ట్ బ్యాంక్ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. చిత్తూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం ఆంధ్ర ప్రావిన్షియల్ కాంగ్రెస్ కమిటీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి ఎంపిక అయినారు. 1946-47 మధ్య కాలంలో పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా కూడా పని చేశారు. రాజ్యాంగ అసెంబ్లీ సభ్యునిగా పని చేశారు. జి.వి.మవలంకర్‌ను రాజ్యాంగ అసెంబ్లీ (శాసనసభ) స్పీకర్‌గా ఎన్నుకున్న నేపథ్యంలో, అయ్యంగార్‌ను దాని డిప్యూటీ స్పీకర్‌గా ఎంపిక చేశారు. రాజ్యాంగ అసెంబ్లీ స్టీరింగ్ కమిటీలో కూడా పని చేశారు. 1950-52 మధ్య కాలంలో అయ్యంగార్ తాత్కాలిక పార్లమెంటు డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగారు. 1950 లో తాత్కాలిక పార్లమెంట్ మొదటి అంచనా కమిటీకి ఛైర్మన్‌గా ఎంపికయ్యారు. సమావేశాలను నైపుణ్యంగా నిర్వహించారు. అయ్యంగార్ గొప్ప, సమర్థ వంతమైన పార్లమెంటు సభ్యుడని నిరూపించు కున్నారు. పార్లమెంటరీ నిబంధనలను నిలబెట్టడానికి కట్టుబడి ఉన్నారు.

1957లో రెండవ లోక్‌సభ ఏర్పడినప్పుడు, అయ్యంగార్ ఐదేళ్ల పాటు ఆయనను స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాయిదా తీర్మానాలు, బిల్లులు, తీర్మానాలు, స్టాండింగ్ కమిటీలు, కాలింగ్ అటెన్షన్ నోటీసులు మొదలైన వాటిపై అయ్యంగార్ పద్ధతి అనుసరణీయంగా మారింది.

1960లో టోక్యోలో జరిగిన 49వ ఇంటర్ పార్లమెంటరీ సమావేశానికి భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి నాయకుడిగా పనిచేసిన ఆయన, భారతదేశం లోని శాసనసభల ప్రిసైడింగ్ అధికారుల సమావేశాల నిర్వహణలో ఆసక్తి చూపారు. 1962 సార్వత్రిక ఎన్నికలలో అయ్యంగార్ మూడవ సారి లోక్‌సభకు ఎన్నికైనా, బీహార్ గవర్నర్‌గా పనిచేయడానికి వీలుగా ఆయన సభ్యత్వానికి రాజీనామా చేశారు. దాదాపు మూడు దశాబ్దాల విశిష్ట పార్లమెంటరీ జీవితంలో ప్రత్యేక గుర్తింపు పొందారు.

రాజకీయ జీవితాన్ని విడిచిపెట్టిన తరువాత, హరిజన్ సేవక్ సంఘ్, రామ్ విలాస్ సభ, చిత్తూరు డ్రామాటిక్ అసోసియేషన్స్, కాన్స్టిట్యూషన్ క్లబ్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ వరల్డ్ ఫెడరల్ గవర్నమెంట్ తదితర సామాజిక - సాంస్కృతిక, విద్యా సంస్థలతో సంబంధం కొనసాగించారు.

పార్లమెంటరీ జీవితం తరువాత, తన జీవితాంతం అయ్యంగార్ ఫిలాసఫీ, సంస్కృత సాహిత్యం, భారతీయ సంస్కృతి అధ్యయనం ప్రచారం పట్ల ఆయన ఎంతో ఆసక్తి చూపారు. కొంతకాలం సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సభ్యుడిగా, రిషికుల్ విశ్వ విద్యాలయ ఛాన్సలర్‌గా పనిచేశారు. భారత పార్లమెంటుపై ఒక పుస్తకాన్ని కూడా రాశారు.

మతాలు ప్రధానంగా మనిషికి, మనిషికి మధ్య ఉన్న తేడాలను తొలగించడానికి, మనిషిలో సోదర భావనను పెంపొందించ డానికి తద్వారా అతన్ని ఉద్ధరించడానికి సహాయపడతాయని నమ్మారు. అయ్యంగార్ ప్రకారం, ఉన్నత కులం లేదా తక్కువ కులం వంటివి ఏవీ లేవు, కానీ ఉన్నత చైతన్యం, తక్కువ చైతన్యం మాత్రమే ఉన్నాయి, ఈ రెండింటికి పుట్టుకతో సంబంధం లేదు. పుట్టుక ప్రాతిపదికన ఆరాధన హక్కును తిరస్కరించడం దైవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరం అని నమ్మారు. ఈ నమ్మకమే హిందూ దేవాలయాల లోకి ప్రవేశించాలన్న దళితుల వాదనకు మద్దతు ఇవ్వడానికి అతన్ని ప్రేరేపించింది.

బీహార్ గవర్నర్‌గా పూర్తి కాలం పనిచేసిన తరువాత, శేష జీవితం గడపడానికి తన స్వగ్రామమైన తిరుపతికి తిరిగి వచ్చి, అయ్యంగార్ 1978 మార్చి 19 న తన 87 వ ఏట చివరి శ్వాస తీసుకునే వరకు సేవలు అందించారు. నిబద్ధత కలిగిన వ్యక్తిగా చరిత్రలో నిలిచారు.



–ఆర్కె సంగనభట్ల

9440595494

# ప్రేమ పొందడం కన్నా ప్రేమించడం ఇంకా మధురం!

భగవద్గీతలోని 'భక్తియోగం' భక్తి తత్త్వాన్నీ, లక్షణాల్నీ భాగవతం విపులంగా తెలిపింది. శ్రీమద్భాగవతం భగవద్భక్తుల లక్షణాలను, భక్తి స్వరూపాన్నీ సవిస్తరంగా ఆవిష్కరించింది. మానవునికి క్రోధం, శోకం లాంటి ఎన్నెన్నో అనుభూతులు ఉన్నా ప్రేమ లాంటి మధురమైన అనుభూతి మరేదీ లేదు! ప్రేమ పొందడం కన్నా ప్రేమించడం ఇంకా మధురం. మానవునికి స్వతహాగా ప్రేమించే లక్షణం ఉన్నా... ఆ ప్రేమ ఒక వ్యక్తికో, ఒక వస్తువుకో మాత్రమే పరిమితమవుతుంది. అప్పుడప్పుడు మాత్రమే కనిపిస్తూ, స్వార్థభావంతో కలుషితమౌతూ, విచ్ఛిన్నమైపోతూ ఉంటుంది. దీనినుంచి బయటపడి ప్రేమతత్వాన్ని అలవర్చుకుంటే భగవంతుడు వశమవుతాడని పురాణాలు చెబుతున్నాయి. భగవంతుడు ఎల్లవేళలా తనయందు భక్తి ఉండాలని కోరుకుంటాడు. భక్తితో తనను శరణు వేడుకున్న వారికి అండగా ఉంటానని చెబుతాడు. మన పురాణాలు, ఉపనిశత్తులు, అన్నీ ఇదే చెబుతున్నాయి. పురాణాలు, ఇతిహాసాల్లో ప్రహ్లాదాదులంతా ఇలాగే భక్తిని చాటారు. భగవంతుడు వారికి అండగా నిలిచాడు. అంటే భక్తికి భగవంతుడు వశమవుతాడన్నది సత్యం. ప్రతిఫలాపేక్ష లేకుండా తనను కొలువుమని గీతాచార్యుడు చెప్పాడు. ఆధునిక కాలంలోనూ ఇదే పద్ధి కొనసాగుతోంది. గుడికి వెళ్లడం భక్తితో చేయాలని అంటారు. భగవంతుని మీద పరిపూర్ణమయిన ప్రేమ కలిగి ఉండడమే భక్తి. అది అమృతానంద స్వరూపం. త్యాగరూపమైనది అయి ఏ కోర్కెలూ లేని స్థితిలో ఉండాలి. అదే మోక్ష అని నారద భక్తి సూత్రాలు చెబుతున్నాయి. నిష్కామంగా ప్రేమించడాన్ని సాధన చెయ్యాలి. ఈ జగత్తులో భగవంతుడు సర్వవ్యాప్తి. సమష్టి రూపమైన భగవంతుని పట్ల... సాధకులు చేసే 'నిష్కామప్రేమ' అనే ఈ ఉపాసనాక్రమానికి కూడా 'భక్తి' అనేదే వ్యవహార నామం. భక్తి సార్వజనీనం, భేదరహితం కావడంవల్ల నిజమైన భక్తిలో లోపాలు ఉండవు. అనంతమైన భగవత్తత్వానికి అనంతమైన కళ్యాణ గుణాలు, రూపాలు, నామాలు ఉన్నాయి! వాటిలో రాముడు, కృష్ణుడు, శివుడు, లలిత తదితర సంపూర్ణ దేవతామూర్తుల్ని ఉపాసనా సౌలభ్యం కోసం వేద, పురాణాలు మనకు అందించాయి. భక్తులు తమకు ఇష్టమైన ఒక దేవతా మూర్తిని స్వీకరించి, సమస్త దేవతలనూ, సమస్త జగత్తునూ ఆ మూర్తిలోనే ఉన్నట్టు భావించి, పరదేవతగా ఉపాసించడం ద్వారా భక్తిని కలిగి ఉండాలి. మనసు మరే ఇతర విషయాల మీద, ఇతర దేవతా రూపాల మీద కాకుండా... ఆ ఇష్టదేవతామూర్తి పైనే నిరంతరం లగ్నం కావాలి. ఇందులో ఏ దేవుడు గొప్ప అన్నది లేదు. అంతా సమానమే. అంతేకాని విష్ణువు, శివుడు వేరని మాత్రం కాదు. ఒకే భగవంతుడు అనేక విభూతులలో, అనేక కార్యాలు చేస్తూ, వేర్వేరు పేర్లతో, వేర్వేరు రూపాలతో, వేర్వేరు తత్త్వాలుగా కనిపిస్తాడు. మనం ఏ రూపంలో భక్తితో కొలిస్తే భగవంతుడు ఆ రూపంలో మనకు సాక్షాత్కరిస్తాడు.



## బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలపై సమావేశం

**మేడ్చల్, మార్చి18:** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 25 నుంచి వచ్చే నెల 25 వతేదీ వరకు ఆత్మీయ సమ్మేళనాలను బీఆర్ఎస్ పార్టీ నిర్వహించనుంది. జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనాల జిల్లా ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో సమ్మేళనాల నిర్వహణపై బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు అధ్యక్షతన సమావేశం జరిగింది.
ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేస్తామన్నారు. కాగా, మొట్టమెదటి సమావేశం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించే విధంగా నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలు, డివిజన్లు, మండలాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, కేపీ, వివేకానంద, జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇంచార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పూలే దంపతుల ఆశయాలను సాధించాలి

**హయత్‌నగర్, మార్చి 18:** సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. దళిత బహుజన సంఘాల ఆధ్వ ర్యంలో హయత్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఎమ్మెల్సీ దయానంద్‌తో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 150 సంవత్సరాల క్రితమే సమాజ హితం కోసం ఆలోచించి ఆచరించిన గొప్ప వ్యక్తులు వారని కొనియాడారు. వారి ఆశయ సాధన కోసం యువత, మహిళలు నడుంబిగించాలన్నారు. భర్త పూలే ద్వారా చదు వు నేర్చుకుని అనేక పాఠశాలలు ఏర్పాటు చేసి మహిళలకు చదువును నేర్పించిన మహనీయురాలు సావిత్రి బాయి పూలే అన్నారు. అంబేడ్కర్ సైతం వారిని ఆదర్శంగా తీసుకు ని రాజ్యాంగ నిర్మాతగా ఎదిగారని అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పారంద స్వామి, ఎర్ర రవీందర్, నాయకులు చెన్న, జంగయ్య, మాజీ కార్పొరేటర్ లక్ష్మి ప్రసన్న, తిరుమల్‌రెడ్డి, నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, గజ్జి భాస్కర్‌యాదవ్, నక్క శ్రీనివాస్‌యాదవ్, ఉమేష్‌యాదవ్, భాస్కర్‌సాగర్, కళ్లెం సుజాతారెడ్డి, సీపీఐ నాయకులు రవీంద్రాచారి, శేఖర్‌రెడ్డి, కడారి పెంటయ్య, ఎర్ర గిరిబాబు, బాబురావు, బాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ వల్లే మెగాటెక్స్‌టైల్ పార్కు

**చేనేతపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలి**

**రాష్ట్రానికి ఐఐహెచ్‌టీ మంజూరు చేయాలి**

**శాసనమండలి సభ్యుడు ఎల్ రమణ**

**హైదరాబాద్, మార్చి 18:** తెలంగాణ ప్రభుత్వ డిమాండ్‌ను ఆమోదించి మెగా టెక్స్‌టైల్‌పార్కు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం సంతోషకరమని ఎమ్మెల్సీ ఎల్ రమణ పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి కేంద్ర జౌళి, ఆర్థికశాఖల మంత్రులను కేటీఆర్ స్వయంగా కలిసి, లేఖల ద్వారా అనేక పర్యాయాలు రాష్ట్రానికి మెగా టెక్స్‌టైల్ పార్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయడంతో కేంద్రం స్పందించిందని శనివారం ఒక ప్రకటనలో గుర్తుచేశారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నల్లగొండ జిల్లాలకు చెందిన నేత కార్మికులు రాష్ట్రంలో పని లేక భీవండి, సోలాపూర్, అహ్మదాబాద్, సూరత్ తదితర ప్రాంతాలకు వలసపోయారని, ఇవన్నీ చూసి చలించిపోయిన కేసీఆర్ వరంగల్‌లో మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయాలని



నిర్ణయించారని తెలిపారు. దీని కోసం 1,200 ఎకరాల భూమి సేకరించి శంకుస్థాపన చేశారని చెప్పారు. అంతర్జాతీయంగా పేరుగాంచిన కిటెక్స్ పరిశ్రమ రాష్ట్రంలో ఏర్పాటు అయ్యేలా చర్యలు చేపట్టారని కొనియాడారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వస్త్ర పరిశ్రమలోని ఉపాధి అవకాశాలు చూసి వలస వెళ్లిన నేతన్నలు తిరిగి వస్తున్నారని గుర్తుచేశారు. చేనేత వస్త్రాలపై కేంద్రం విధిస్తున్న 5 శాతం జీఎస్టీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత క్లస్టర్లను మంజూరు చేసి చేనేత కళాకారుల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. రాష్ట్రానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)ని మంజూరు చేయాలని, రద్దు చేసిన హ్యాండ్లూమ్ బోర్డ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

## రవాణా శాఖకు 6,285 కోట్ల రాబడి

**నిరుటి కంటే రూ.2,309 కోట్లు అధికం**

**మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అంచనా**

**హైదరాబాద్, మార్చి 18:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర రవాణా శాఖకు మొత్తం రూ.6,285 కోట్ల ఆదాయం రావచ్చని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అంచనా వేశారు. మార్చి 17 నాటికి రూ.6,055 కోట్ల ఆదాయం వచ్చినట్టు వెల్లడించారు.



రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1.53 కోట్ల వాహనాల ద్వారా 2021-22లో రవాణా శాఖకు రూ.3,971 కోట్ల ఆదాయం వచ్చిందని, ఈ ఏడాది అదనంగా మరో రూ.2,309 కోట్ల ఆదాయం వచ్చే అవకాశాలున్నాయని తెలిపారు. శనివారం ఆయన ఖైరతాబాద్‌లోని ప్రాంతీయ కార్యాలయంలో రవాణా శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర రవాణ శాఖ సేవలు, వనరులు, ఆదాయ వృద్ధికి చేపట్టాల్సిన చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పన్నులు కట్టకుండా తిరుగుతున్న వానదారుల నుంచి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ ద్వారా రూ.63.58 కోట్లు వసూలు చేసినట్టు తెలిపారు. సమీక్షలో రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి కే శ్రీనివాసరాజు, రవాణా శాఖ కార్యదర్శి బుద్ధ ప్రకాశ్ జ్యోతి, సంయుక్త రవాణా కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట ఆలయం అత్యద్భుతం

**స్వామివారి ఆజ్ఞతోనేఆలయ పునర్నిర్మాణం చేసిన కేసీఆర్**

**తెలంగాణలో అన్ని రంగాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి**

**దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ ప్రశంస**

**ఘనంగా స్వాగతం పలికిన మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి**

**యాదాద్రి భువనగిరి, మార్చి 18 (ప్రజామంటలు):** ఇల వైకుంఠం దివి నుంచి భువికి దిగొచ్చినట్టుగా యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యద్భుతంగా పునర్నిర్మించిందని ఆధ్యాత్మిక గురువు, దత్తపీఠా ధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ ప్రశంసించారు. యాదగిరి గుట్ట క్షేత్రం ఇలవైకుంఠంగా వర్ధిల్లుతున్నదని పేర్కొన్నారు. లక్ష్మీనరసింహ స్వామి ఆజ్ఞతోనే సీఎం కేసీఆర్ ఆలయాన్ని పునర్నిర్మించారని చెప్పారు. రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్.. అభివృద్ధిలోనూ పరుగులు పెట్టిస్తున్నారని కొనియాడారు. శనివారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారిని స్వామీజీ దర్శించుకున్నారు.
ఈ సందర్భంగా స్వామీజీ 'నమస్తే తెలంగాణ'తో ముచ్చటించారు. ఆ విశేషాలు స్వామీజీ మాటల్లోనే.. 'తెలంగాణ ప్రభుత్వం యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణాన్ని అద్భుతంగా చేపట్టింది. భక్తులకు ఆధ్యాత్మికతతోపాటు ఆహ్లాదాన్ని పంచే విధంగా నిర్మించడం అభినందనీయం. పూర్తి కృష్ణశిలతో నిర్మించిన ఈ గుడిని చూస్తుంటే.. ఇలవైకుంఠం దివి నుంచి భువిపై అడుగిడినట్టు ఉంది. యజ్ఞంలా ఆలయాన్ని పునరుద్ధరించడం గొప్ప విషయం. ఆలయ మాడవీధులు, ప్రాకారాలు, శిల్పాలు, క్యూ కాంప్లెక్స్, లక్ష్మీ పుష్కరిణి, వ్రతమండపం, కల్యాణ కట్ట ప్రతీది ఆకర్షణీయంగా నిర్మించారు. కొండపైన, కింద, పట్టణమంతా గ్రీనరీ, పరిశుభ్రతతో సుందరంగా ఉంది. ఘాట్ రోడ్లు, రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన చెట్లు, పార్కులు పచ్చదనాన్ని పంచుతున్నాయి. తమిళనాడులో ఆలయాలను చూసి.. తెలంగాణలో కూడా అలాంటి కట్టడాలు ఉంటే బాగుండేదని అనుకునేవాడిని. అది సీఎం కేసీఆర్ రూపంలో సాధ్యమైంది. ఇలాంటి కట్టడం ఈ మధ్య కాలంలో ఎక్కడా నిర్మించలేదు. లక్ష్మీనరసింహస్వామి ఆజ్ఞతోనే కేసీఆర్.. చక్రవర్తులు, మహారాజుల మాదిరిగా ఎంతో అద్భుతంగా ఈ ఆలయాన్ని నిర్మించారు. ఈ యజ్ఞంలో కళాకారులు, శిల్పులు ఎంతో మంది భాగస్వాములయ్యారు. వారికి స్వామివారికి సేవ చేసుకొనే యోగం కలిగింది. భవిష్యత్‌లో యాదగిరి క్షేత్రం చరిత్రలో నిలిచిపోతది' అని స్వామీజీ ఆశీస్సులు అందజేశారు.
'కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం సాధించిన యోధుడు. ఎన్నో జన్మలు తపస్సు చేస్తేనే యోగి అవుతాడు. అటువంటి యోగి తెలంగాణ రాష్ట్రానికి సీఎం కావడం గొప్ప వరం. దేవుడు ఆయనకు ఎంతో



జ్ఞానం ఇచ్చారు. తెలంగాణను ఎలా అభివృద్ధి చేయాలో ఓ ఐడియా, విజన్ ఉన్న నేత. అభివృద్ధి కార్యసాధకుడు. అందరికీ సంక్షేమ ఫలాలు ఎలా అందించాలి, అందరినీ సమన్వయం ఎలా చేయాలనేది కేసీఆర్‌కు తెలుసు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలి. ఆకాశానికి పందిరి ఎవరూ వేయలేరు. కొంత మందికి కొన్ని నచ్చవు. చిన్న చిన్న ఘటనలు ఎదురవుతూనే ఉంటాయి. వాటిని ఎదుర్కొంటూ ముందుకెళ్లాలి. మనుషుల్లో పరిశుభ్రత పెరగాలి. ప్రజల్లో చైతన్యం రావాలి' అని స్వామీజీ పేర్కొన్నారు.

**స్వామీజీకి మంత్రి అల్లోల ఘన స్వాగతం**

ఉదయం తన పరివారంతో యాదాద్రి క్షేత్రానికి చేరుకున్న దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీకి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో డప్పు వాయిద్యాల మధ్య ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గర్భాలయంలో స్వయంభూ లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు చేసిన స్వామీజీ.. ప్రధానాలయంలోని ధ్వజస్తంభానికి నమస్కరించారు. అనంతరం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కుటుంబ సభ్యులతోపాటు భక్తులకు స్వామీజీ ఆశీస్సులు అందజేశారు. స్వామీజీకి స్వాగతం పలికిన వారిలో మంత్రితోపాటు ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, ఈఓ గీత తదితరులు ఉన్నారు.

# బిర్యానీకి బై బై.. మిల్లెట్ ఫుడ్‌కే జై

**ఫిట్‌కాప్ యాప్‌లో సిటీ పోలీస్ హెల్త్ ప్రొఫైల్**

**సిబ్బంది కుటుంబసభ్యులకూ అవగాహన**

**సిటీ పోలీస్ కమిషనరేట్‌లో మిల్లెట్ ఫుడ్ అమలు**

**హైదరాబాద్, (ప్రజామంటలు):** బందోబస్తు విధులలో నిత్యం బిజీగా ఉండే పోలీస్ సిబ్బందికి ఆరోగ్యం చాలా ముఖ్యం. ఆరోగ్యంగా ఉన్నప్పుడే సంతోషమైన జీవనం సాగిస్తామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సిబ్బందిలో అవగాహన తెస్తున్నారు. వ్యాయామం, పౌష్టికాహారంపై దృష్టి పెట్టాలని సిబ్బందితో పాటు వారి కుటుంబసభ్యులకు మార్గనిర్దేశం చేస్తున్నారు. ఇందులో భాగంగానే బందోబస్తులో ఉండే సిబ్బందికి చిరుధాన్యాలతో కూడిన భోజనాలను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో బందోబస్తులో ఉండేవారికి ఎక్కువగా బిర్యానీలు, అన్నం, టిఫిన్లు ఏర్పాటు చేసేవారు. ఈ ఆహారం కంటే చిరుధాన్యాల ఆహారంతో ప్రతి ఒక్కరి ఆరోగ్యం బాగుండడమే కాకుండా, విధి నిర్వహణలో చురుకుగా ఉంటారని భావిస్తూ వారికి చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని పంపిణీ చేస్తున్నారు. గతంలో కంటే ఖర్చు 20 శాతం పెరుగుతున్నా, సిబ్బంది ఆరోగ్యమే ప్రధానమని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా బందోబస్తు విధులు నిర్వహించిన నగర పోలీస్ కమిషనరేట్‌లోని సిబ్బందికి చిరుధాన్యాలతో కూడిన భోజనాలను సరఫరా చేశారు.
నగరంలో ఉన్న పోలీస్ సిబ్బందిని ఆరోగ్యంగా ఉంచాలనే లక్ష్యంగా 'ఫిట్‌కాప్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. అందరి హెల్త్ ప్రొఫైల్‌ను భద్రపరుస్తున్నారు. గత ఏడాది నవంబర్‌లో నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, తన సతీమణి లలితా ఆనంద్‌తో కలిసి ఈ యాప్‌ను ప్రారంభించారు.
ఈ యాప్ ప్రారంభానికి పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు. పోలీస్ సిబ్బంది విధుల గూర్చి అవగాహన ఉండి, పోలీస్ సిబ్బంది ఆరోగ్యం బాగుం డడంలో వారి కుటుంబ సభ్యులు కూడా కీలక భూమిక పోషిం చాలని సీపీ సూచనలు చేశారు. ఒక పక్క వ్యాయామం చేస్తూ.. మరో పక్క పౌష్టికాహారం




తినాలని, అందుకు కుటుంబసభ్యుల పూర్తి సహాయ సహకారాలు ఉండాలన్నారు. ఇందులో భాగంగా సిబ్బంది కూడా చిరుధాన్యాలపై దృష్టి పెట్టి, రోజూ తినే ఆహారంలో వాటిని భాగస్వామ్యం చేసుకోవాలని సూచించారు. దీంతో పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు కూడా ఖర్చుకు వెనుకాడకుండా ఆరోగ్యంపై దృష్టి పెట్టి చిరుధాన్యాలను మధ్యాహ్నం భోజనాలలో అందిస్తున్నారు. నగర పోలీస్ కమిషనరేట్ సిబ్బంది ఆరోగ్యం అలవాట్లలో ఫిట్ కాప్‌తో పెనుమార్పు వచ్చింది. అనారోగ్యానికి గురై దవాఖానలలో ఖర్చు పెట్టడం కంటే, కొద్ది ఖర్చు ఎక్కువైనా చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం ఉంటుందని సిబ్బంది భావిస్తున్నారు.

**ఆరోగ్యమే వారికి శ్రీరామ రక్ష**

మనిషికి ఆరోగ్యమే శ్రీరామ రక్ష. పోలీస్ సిబ్బందికి ఇదే విషయాన్ని చెబుతున్నాం. సిబ్బంది కుటుంబసభ్యులకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. పౌష్టికాహారం, వ్యాయామం తప్పనిసరి చేయడంలో సూచనలు చేస్తున్నాం. సిబ్బందికి బందోబస్తు సమయంలో చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నాం. చిరుధాన్యాల ఆహారంతో త్వరగా అకలి కాదు. ఎక్కువసేపు చురుకుగా ఉంటారు. నేను స్వయంగా మూడు సంవత్సరాల నుంచి చిరుధాన్యాల ఆహారం తింటూ ఆరోగ్యంగా ఉన్నాను. నగర సిబ్బంది కూడా ఆరోగ్యంగా ఉండేందుకు నిరంతరం ప్రోత్సహిస్తున్నాం.

# కడగండ్లు మిగిల్చిన వడగండ్లు

**గోన్‌గొప్పులలో పడిన వడగండ్ల వర్షం**

**పలు ప్రాంతాల్లో గాలులకు కూలిన చెట్లు**

**మరో రెండు రోజుల పాటు వర్షాలు!!**

**నిజామాబాద్, మార్చి 18 (ప్రజామంటలు):** జిల్లాలో పలు ప్రాంతాల్లో శనివారం వర్షం పడింది. వడగల్లతో కూడిన వర్షం కూడా కొన్ని ప్రాంతాల్లో పడింది. ఈ వర్షం వల్ల కొన్నిచోట్ల మొక్కజొన్న తడిసిపోగా, భీంగల్ మండలం పరిధిలో గోన్‌గొప్పుల ప్రాంతంలో రాళ్లు పడడంతో వరి గొలుసులు దెబ్బతిన్నాయి. ఈ వర్షం గాలిదుమారంతో రావడంతో పలు ప్రాంతాల్లో చెట్లు కూడా పడిపోయాయి. వర్షానికి, గాలుల కు కొన్నిచోట్ల విద్యుత్ సరఫరా గంటల పాటు నిలిచిపోయింది. నగరం పరిధిలోని వాణిజ్య సముదాయాల పరిధిలో గంటల పాటు కరెంటు నిలిచిపోవడంతో ఆసుపత్రులతో పాటు వ్యాపారస్తులు ఇబ్బందులు ఎదు ర్కొన్నారు. జిల్లాలో శనివారం సాయంత్రం పలు ప్రాంతాల్లో గాలి దు మారాలు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఈ వర్షం వల్ల పలుచోట్ల చెట్లు పడిపోయాయి. కోటగిరి, రుద్రూర్ ప్రదాన రహదారిలో రాణంపల్లి వద్ద చెట్లు పడిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. భీంగల్ మండలం పరిధిలో వడగల్లు పడడంతో కొన్నిచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. వర్ని, మోస్రా, చందూర్, ఎడపల్లి, బోధన్ ప్రాంతాల్లో జల్లులతో కూడిన వర్షం పడింది. కమ్మర్‌పల్లి, వేల్పూర్, ఇతర మండలాల పరిధిలో కూడావర్షం పడడంతో ఆరబోసిన మొక్కజొన్న తడిసిపోయింది. నిజామాబాద్ రూరల్, డిచ్‌పల్లి, ఇతర ప్రాంతాల్లోనూ జల్లులతో కూడిన వర్షం పడింది. నిజామాబాద్ నగరంలోని మాలపల్లిలో పిడుగు పడడంతో మదర్సాలో ఉన్న ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

**పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం**

గాలులతో కూడిన వర్షం పడడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నిజామాబాద్ నగరంలోని ఖలీల్‌వాడి, ఇతర ప్రాంతాల్లో రెండున్నర గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. నగరం పరిధిలో నిత్యం మరమ్మత్తులు కొనసాగిస్తున్న చిరు జల్లులకే కరెంటు సరఫరా నిలిచిపోతుంది. గత మూడు రోజులుగా పడుతున్న జల్లుల వల్ల నగరం పరిధిలోని వాణిజ్య సముదాయాలున్న ప్రాం తాల్లో విద్యుత్ అంతరాయం వస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంత్రం వేళ ఆసుపత్రులకు వచ్చే రోగులు కూడా సమస్యలు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ అంతరాయం వల్ల దుకాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా మూడు రోజులుగా జల్లుల తో కూడిన వర్షం పడుతుంది. ఈ వర్షం మరో రెండు రోజుల పాటు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులతో పాటు వ్యవసాయశాఖ అదికారులు తెలిపారు.

**భీమ్‌గల్ రూరల్:** శనివారం సాయంత్రం భీమ్‌గల్ మండలంలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కు రిసింది. మండలంలోని పిప్రి, బాచన్‌పల్లి, బాచన్‌పల్లి, గోన్‌గొప్పుల, ము చ్కూర్ గ్రామాల్లో వడగండ్ల తో కూడిన రాళ్లవర్షం కురిసింది. పల్లికొండ గ్రామంలో చేతికొచ్చిన వరిపంట రాళ్లవర్షంతో వడ్లు నేలరాలాయి. పల్లికొండ గ్రామానికి చెందిన పోల్సాని సతీష్‌కు చెందిన సుమారు ఆరు ఎకరాల్లో రాళ్ల వర్షానికి వడ్లు పెద్దమొత్తంలో నేలరాలాయి. సుమారు అర గంటపాటు వర్షం కురిసింది.

**కోటగిరిలో ఈదురుగాలుల బీభత్సం**

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో శనివారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు సంభవించి ఉరుములు, మెరుపులతో కూడిన గాలులు, వర్షం కురిసింది. ఈదురు గాలులకు ఆయా ప్రాంతాలలో, గ్రామాలలో చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పొద్దుతిరుగుడు పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది.
రుద్రూరు: రుద్రూరు మండలంలో ఈదురు గాలుల భీభత్సవం సృష్టించింది. వర్షంతో పలు చోట్ల ఆరు తడి పంటలు దెబ్బతిన్నాయి.

**ఆయా మండలాల్లో భారీ వర్షం**

వర్ని: వర్ని ఉమ్మడి మండలంలో శనివారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు



గాలులకు పలుచోట్ల పంటలు నేలకొరగగా ఇంటిపై కప్పులు ఎగిరిపోయాయి. రోడ్లపై చెట్లు విరిగి పడ్డాయి. వర్షం జోరు కొనసాగితే పంటలు చేజారిపోయే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.
నవీపేట: మండలంలోని పలు గ్రామాలలో శనివారం రాత్రి వర్షం కురిసింది. సాయంత్రం నుంచి భారీ ఈదురుగాలులు వీయగా రాత్రి సమయానికి వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమలమయ్యాయి. గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.
బోధన్ రూరల్: బోధన్, సాలూర మండలాల్లోని పలు గ్రామాలలో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు రావడంతో

# ప్రశ్నిస్తే దాడులా...?

**గంగాధర మార్చి 18 (ప్రజామంటలు):** చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం వెంకంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామ సమస్యలపై గత నాలుగు సంవత్సరాలుగా సోషల్ మీడియా వేదికగా గ్రామ సమస్యలను అధికారులకు



తెలియజేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న చొప్పదండి నియోజకవర్గం టీఎంకె జేయు సోషల్ మీడియా కన్వీనర్ కొప్పుల వెంకటేష్ పై అదే గ్రామానికి చెందిన సర్పంచ్ ముక్కెర మల్లేశం వారి తమ్ముడు ముక్కెర శ్రీనివాసులు పిడుగుద్దులతో దాడి చేయడం తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజాస్వామ్యంలో ప్రజలకు వారధిగా నిలిచే జర్నలిస్టులు. వారిపై దాడులు జరుగుతే సహించేది లేదని టిఎంకె జేయు రాష్ట్ర బాధ్యులు కొప్పుల బుచ్చిరాములు పటేల్ తీవ్రంగా ఖండించారు. మరోసారి పునరావృతం అయితే సహించేది లేదని బాధ్యతగల పదవిలో ఉండి సమాధానం చెప్పాల్సింది పోయి దాడులు చేయడం సరైనది కాదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ కోల తిరుపతి పటేల్, చొప్పదండి కన్వీనర్ బేతి గంగాధర్ పటేల్, కరీంనగర్ జిల్లా కన్వీనర్, సృజన్ పటేల్, జగిత్యాల కన్వీనర్ దేవేందర్ పటేల్ సిరిసిల్ల జిల్లా ధూమాల శ్రీనివాస్, పటేల్ పెద్దపల్లి జిల్లా తన్నీరు రాజేంద్ర పటేల్, పడాల తిరుపతి పిప్పరి శ్రీనివాస్, నామాల శ్రీనివాస్, సోమినేని రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన
# ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి

**భీమదేవరపల్లి మార్చి 18 (ప్రజామంటలు):** మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డి. శ్రీనివాస్



ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజన వసతిపై ఆరా తీశారు. పాఠశాలలోని సదుపాయాలపై ఎస్ఓ జ్యోతిని అడిగి తెలుసు కున్నారు. పాఠశాలలోని వంటగదిని పరిశీలించారు. మౌలిక సౌకర్యాల కల్పనపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ విద్యార్థి
# ఉద్యమకారుల సంఘర్షణ సభ

**పోస్టర్ ఆవిష్కరణ**

**జనగామ మార్చి 18 (ప్రజామంటలు):** జనగామ జిల్లా విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో మార్చ్ 25న కాకతీయ యూనివర్సిటీ లో జరిగే తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సంఘర్షణ సభకు సంబంధించిన కరపత్రం, పోస్టర్ ఆవిష్కరించారు. విద్యార్థి, ఉద్యమకారులు మేధావులు ప్రజాసంఘాల నేతలు అధిక సంఖ్యలో పాల్గొని



విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఈ కార్యక్రమంలో కె.యూ. విద్యార్థి సంఘాల జాక్ నేతలు ఇట్టబోయిన తిరుపతి యాదవ్, కె.యూ జాక్ చైర్మన్, విజయ్ కన్నా, పిడిఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుగులోత్ రాజు నాయక్, గిరిజన శక్తి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మేడ రంజిత్ కుమార్ టిజివిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జనగామ జిల్లా విద్యార్థి జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు, టీజీవిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పిట్టల సురేష్,టీజీవిపి జనగామ జిల్లా కార్యదర్శి తుంగ కౌశిక్, పట్టణ అధ్యక్షుడు వెంపటి అజయ్, తదితరులు పాల్గొన్నారు.

# నూతన బాధ్యతలు చేపట్టిన తహసిల్దార్‌కి శుభాకాంక్షలు

**సైదాపూర్ మార్చి 18 (ప్రజామంటలు)** నూతన బాధ్యతలు స్వీకరించిన సైదాపూర్ మండలం తహసిల్దార్ గా భావ్ సింగ్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారిని



మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచం ఇచ్చి శాలువా తో సత్కరించడం జరిగింది. సైదాపూర్ మండల పత్రికా ప్రతినిధులు సైదాపూర్ మండల తాహసిల్దార్ కి స్వాగత శుభాకాంక్షలు తెలియచేసారు.

# పశు మిత్రలకు కనీస వేతనం చెల్లించాలి

◆ **సీఐటీయూ జిల్లా కన్వీనర్ సులోచన**

**జగిత్యాల మార్చి 18 (ప్రజామంటలు):** పశు సంవర్ధక శాఖలో పనిచేస్తున్న పశు మిత్రులకు కనీస వేతనం నిర్ణయించి అమలుచేయాలని సీఐటీయూ జగిత్యాల జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన అన్నారు. జగిత్యాల జిల్లాలో పనిచేస్తున్న 50 మంది పశు మిత్రులు శనివారం తెలంగాణ రాష్ట్ర పశుమిత్రల వర్కర్స్ యూనియన్ జగిత్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీఐటీయూ కన్వీనర్ సులోచన ఆధ్వర్యంలో జగిత్యాలలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకులు రమేష్, సులోచన, పశుమిత్ర యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీరాం పద్మలు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పశు సంవర్ధక శాఖ పరిధిలో పనిచేస్తున్న పశుమిత్రలు జంతువులకు ఆరోగ్యపరమైన సేవలు అందిస్తున్నారని, ఎలాంటి పారితోషకం లేకుండా వెట్టిచాకిరీతో రాష్ట్ర ప్రభుత్వం చేయించుకుంటున్నదని ఆరోపించారు. ఈ డిపార్ట్మెంట్లో రాష్ట్రవ్యాప్తంగా 2500 మంది పశుమిత్రులు గత 8 సంవత్సరాల నుండి సేవలు అందిస్తున్నారని, ఎక్కువ మంది మహిళలు బడుగు, బలహీన వర్గాలకు చెందినవారే ఉన్నారని వారు తెలిపారు. వీరికి ఐకెపి ద్వారా ట్రైనింగ్ ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వము ఎలాంటి పారితోషికాలు నిర్ణయించకుండా పశువైద్య శాఖలో పశుమిత్రులుగా నియమించారని, వీరు వారికి కేటాయించిన ఊరుతో పాటు సబ్ సెంటర్ పరిధిలోని రైతులకు సంబంధించిన జంతువుల ఆరోగ్య సమస్యలను పర్యవేక్షిస్తుంటారని రమేష్, సులోచన, పద్మలు తెలిపారు. పశుపోశకులకు-పశు సంవర్ధక శాఖల మధ్య వారధిలా పశుమిత్రలు పనిచేస్తూ పశువులకు వైద్య సేవలందిస్తున్నారని వివరించారు. రాత్రనక పగలనక ఎప్పుడు పిలిస్తే అప్పుడు వెళ్లి పాడి పశువులు, జంతువులకు వైద్యపరమైన సేవలు అందిస్తున్నా వీరికి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి పారితోషకం లేకుండా పశుమిత్రులతో వెట్టి చాకిరి చేయించుకోవడం చాలా బాధాకరమన్నారు. ఆశ వర్కర్ల మాదిరిగా ప్రభుత్వమే బాధ్యత తీసుకొని వేతనం నిర్ణయం చెయ్యాలని వారు




డిమాండ్ చేశారు. దేశ ఉత్పత్తిలో రెండవ భాగంగా ఉన్న పశు సంపదను పరిరక్షిస్తున్న పశుమిత్రలు కనీస వేతనం, పని భద్రత కల్పించకపోవడం శోచనియమని పేర్కొన్నారు. అడగకుండానే అన్నీ సమస్యలు పరిష్కరిస్తానన్న ముఖ్యమంత్రి కేసీఆర్ పశుమిత్రలను విస్మరించడం సరికాదన్నారు. వేతనం నిర్ణయించకుండా వెట్టి చాకిరీ చేయించుకోవడం చాలా దుర్మార్గమని చెబుతూ రాబోయే రోజుల్లో పశుమిత్రలు పోరాట మార్గం ద్వారా హక్కులు సాధించుకుంటారని వారికి సీఐటీయూ అండగా ఉంటుందన్నారు.వెంటనే ప్రభుత్వం పశుమిత్రలను ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సరిత, కదారి లావణ్య, వైష్ణవి, మమత, శైలజ, లత, గోపినవేణి సరితలు పాల్గొన్నారు.

## "సత్సాంప్రదాయక తెలుగు కాలమానిని"
# ఆవిష్కరించిన డాక్టర్ మోహనకృష్ణ భార్గవ

**జనగామ మార్చి 18 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కేంద్రంలోని శ్రీ హనుమత్ రామనాథ సహిత శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ప్రముఖ జ్యోతిష్య పండితులు, సామాజిక కవి, రచయిత, డాక్టర్ మోహనకృష్ణ భార్గవ రచించి, ప్రచురించిన సత్సాంప్రదాయక తెలుగు కాలమానిని వైభవంగా ఆవిష్కరణ జరిపారు. భక్తుల సమక్షంలో శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది తెలుగు కాలమానిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోహనకృష్ణ మాట్లాడుతూ.... గత ఆరు సంవత్సరాలుగా సత్సాంప్రదాయక తెలుగు కాలమానిని ప్రచురిస్తున్నట్లు తెలిపారు. సనాతన వైదిక సాంప్రదాయాన్ని, తెలుగు సంస్కృతులను పరిరక్షించుకుంటూ, భావితరాలకు పదిలంగా అందించాలనే కాంక్షతో, ధర్మప్రచారంలో తన బాధ్యతగా తెలుగు కాలమానిని ప్రచురించి, ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు., తిథి, వార, నక్షత్రాలు, అమృతఘడియలు, వర్జ దుర్ముహూర్తాలు, శుభ ముహుర్తాలు, మాస లగ్న కుండలీలతో., కలి, విక్రమ, శాలివాహన శక సూచికలతో అద్భుతమైన రీతిలో నిర్మించినట్లు తెలిపారు. దేవాలయ గౌరవాధ్యక్షులు గజ్జెల నర్సిరెడ్డి మాట్లాడుతూ కాలమానిని సామాన్యులకు కూడా సులభంగా అర్థమయ్యే రీతిలో ఉందని, మల్టీకలర్ లో ఆకర్షణీయంగా, విద్యార్థులకు సైతం ఆసక్తికరంగా కనబడుతుందని అన్నారు. అధ్యక్షులు జక్కా నర్సిరెడ్డి మాట్లాడుతూ ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి కాలెండర్ రూపొందించి పంపిణీ చేస్తున్న మోహనకృష్ణకు ధన్యవాదాలు



తెలుపుతూ, సాంప్రదాయాన్ని కాపాడుకోవాలని, భావితరాలకు అందించాలనే కాంక్షతో కృషి చేస్తున్న వారికి అభినందనలు తెలిపారు. ఈ ఆవిష్కరణలో యెలసాని కృష్ణమూర్తి, రాంబాబు, కుర్రెముల సత్యనారాయణ, రాంప్రసాద్, పాశం శ్రీశైలం, కందాడి యాదగిరి, మల్లారెడ్డి, ఆకుల రమేష్, ప్రవీణ్ కుమార్, మేకల శంకరయ్య, రవి, ఉపేందర్, అంబటి బాలరాజు, కల్లెం నాగరాజు, చంద్రమౌళీ, స్రవంతి, శ్యామల, విజయలక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో "ఛలో ఢిల్లీ"

◆ **ఏప్రిల్ 4న హైదరాబాద్ దిగ్బంధం**

**భీమదేవరపల్లి మార్చి 18 (ప్రజామంటలు):** ఎస్సీల వర్గీకరణ బిల్లును పార్లమెంట్ లో ప్రవేశ పెట్టకుండా మాదిగలను మోసం చేస్తున్న బీజేపీ పార్టీతో యుద్ధం కోసం ప్రతి మాదిగ బిడ్డ సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జన్ను దినేష్ మాదిగ అన్నారు. శనివారం ములుకనూర్ లోని అంబేద్కర్ కూడలిలో మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 న, జరిగే ఛలో ఢిల్లీ ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 4 న, జరుగబోయే హైదరాబాద్ దిగ్బంధం కరపత్రాల ఆవిష్కరణ ఎంఎస్పి మండల ఇంఛార్జి మాట్ల వెంకటస్వామి మాదిగ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిదులుగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జన్ను దినేష్ మాదిగ, జిల్లా ఇంఛార్జి మంద రాజు మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వర్గీకరణ చేస్తామని ఇచ్చిన మాటను తప్పిందని అన్నారు. 2014 లో బీజేపీ అధికారంలోకి వచ్చి ఇప్పటికీ 9 ఏండ్లు గడుస్తున్న వర్గీకరణ చెయ్యకుండా మాదిగలకు ఇచ్చిన హామీని నెరవేర్చకుండ బీజేపీ పార్టీ మోసం చేస్తుందని అన్నారు. ఇక బీజేపీ పార్టీతో తాడో పేడో తేల్చుకోవడం కోసం ప్రతి మాదిగ బిడ్డ ఏప్రిల్ 4 న జరుగు హైదరాబాద్ దిగ్బంధంకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గంగారపు శ్రీనివాస్ మాదిగ, జిల్లా కన్వీనర్ గద్దల సుకుమార్ మాదిగ, జిల్లా కన్వీనర్ రేణుకుంట్ల భిక్షపతి



మాదిగ, జిల్లా నాయకులు తాల్లపల్లి మధుకర్ మాదిగ, బొడ్డు శాంతి సాగర్, కొట్టే కళ్యాణ్, చిలుక రాజు, పారునందుల సురేష్, నాగిండ్ల చందర్, సుంచు శ్యామ్ సుందర్, తాల్లపెల్లి అశోక్, మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు బోల్లెంపెల్లి ప్రకాష్, చిలుక మధుకర్, మాదుగుల ప్రతాప్, చిటుకురీ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ చిత్ర పటానికి సెర్ప్ ఉద్యోగుల పాలాభిషేకం

**జగిత్యాల మార్చి 18 (ప్రజామంటలు):** సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్ వర్తింప చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు జీవో నెంబర్ 11ను విడుదల చేసి సెర్ప్ ఉద్యోగులకు తీపి కబురు ఇచ్చిన సందర్భంగా ఈరోజు జగిత్యాల మండల సెర్ప్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి, స్వీట్లు పంపిణి చేసుకోవడం జరిగింది. ఈసందర్భంగా టిజిఓ జిల్లా అధ్యక్షుడు రవిబాబు మాట్లాడుతూ.... గత 22 సంవత్సరాలుగా సెర్ప్ సిబ్బంది గ్రామీణాభివృద్ధి శాఖ లో విధులు నిర్వహిస్తున్న వీరిని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పేస్కేలు ప్రకటించడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి, ఉద్యోగులకు అభినందించడం జరిగింది. సెర్ప్ సిబ్బంది మాట్లాడుతూ.... రాష్ట్ర ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు కు అలాగే మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, రాష్ట్ర మంత్రి మండలికి ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యే లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మండల పరిషత్ సూపర్డింటెంట్ గంగాధర్ సెర్ప్ సిబ్బందిని అభినందించారు.



జిల్లా డిపియం మల్లేశం, ఎపియం వి. గంగాధర్, సిసి లు బి. రవిందర్, పి. గంగారాం, విద్య సాగర్, సంతోష్, ఇజియస్ సిబ్బంది మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# భాజపా ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్

**జగిత్యాల మార్చి 18 (ప్రజామంటలు):** ఇటీవల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్ 1, తదితర పరీక్షల్లో లీకేజీ కి నిరసనగా బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జగిత్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ రావు (మోరపెల్లి సత్తన్న) ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు సాంబారి ప్రభాకర్




బీజేపీ రాష్ట్ర నాయకురాలు తుల ఉమ, జగిత్యాల అసెంబ్లీ కన్వీనర్ చిలకమర్రి మదన్, ధర్మపురి అసెంబ్లీ కన్వీనర్ సత్యం, జిల్లా పదాదికారులతో వందలాది బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పెద్దఎత్తున ర్యాలీగా కలెక్టరేట్ చేరుకొని ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, భూమి రమణ, జగిత్యాల నియోజకవర్గ నాయకులు పన్నాల తిరుపతి రెడ్డి, బోగ శ్రావణి ప్రవీణ్, కౌన్సిలర్ పులి రమాదేవి, కోరుట్ల నియోజకవర్గ యువ నాయకులు సురభి నవీన్ కుమార్, కొక్కు గంగాధర్, బీజేపీ మెట్ పల్లి పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యులు దొనికెల నవీన్, విజయ్ పీసరి నర్సయ్య, తిరుమలవాసు, గిన్నెల అశోక్, లావణ్య, వరలక్ష్మి, బీజేపీ సీనియర్ నాయకులు పిన్నంశెట్టి గంగాధర్, రాజరెడ్డి తదితరులు వందలాది బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం

**జగిత్యాల మార్చి 18 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో గల పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ సమన్వయ జిల్లా ఇంఛార్జి కొలేటి దామోదర్ రాగా సంక్షేమ శాఖ





మంత్రి కొప్పుల ఈశ్వర్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు , జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, చొప్ప దండి ఎమ్మెల్యే సుంకె రవి శంకర్, తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్. గొడిసెల రాజేశం గౌడ్, గ్రంధాలయ చేర్మెన్ చంద్ర శేకర్ గౌడ్, డీసీఎంఎస్ శ్రీకాంత్ రెడ్డి , రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ ఛైర్మన్ లోక బాపు రెడ్డి, జితేందర్ రావు, జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ నాయకులు ఆయా మండలాల జెడ్పీటీసీలు, ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్షాలకు నష్టపోయిన
# పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి

**మంగళంపల్లి జనార్దన్**

**జనగామ మార్చి 18 (ప్రజామంటలు):** రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు నష్టపోయిన పంటలకు యుద్ధ ప్రాతిపదికన నష్టపరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళపల్లి జనార్దన్ విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. ప్రభుత్వ అధికారులు పంట నష్టం సర్వే చేసి వెంటనే యుద్ధ ప్రాతిపదికన నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని కోరారు.



# కీడ్జీ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

**రాంగోపాల్ పేట్ డివిజన్ మార్చి 18 (ప్రజామంటలు):** సికింద్రాబాద్ కీడ్జీ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ప్యాట్నీ సెంటర్ హరిహర కళాభవన్ లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక రాంగోపాల్ పేట్ డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. పాఠశాల పిల్లలు ఉత్సాహంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి



ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ మాట్లాడుతూ.... సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ పిల్లలకు మేధస్సు ఉత్తేజం, శారీరక మానసిక ఒత్తిడి నుండి దూరాన్ని ఉంచుతూ వారిలో మరింత నూతన స్పూర్తిని పెంపొందిస్తుంది అని అన్నారు. పాఠశాల వార్షికోత్సవమును విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసిన అధ్యాపక బృందం.



హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం మోత్కులపల్లి గ్రామంలో చీమల కల్పన మోహన్ ల కుమార్తె మొదటి పుట్టినరోజు వేడుకకు హాజరై చిన్నారిని దీవించిన బీజేపీ నాయకులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ

**భీమదేవరపల్లి మార్చి 18 (ప్రజామంటలు):** డా. పీవీ రంగారావు గురుకుల కళాశాల సీనియర్ ఇంటర్ విద్యార్థులకు హుజూరాబాద్ అంబుజా గ్యాస్ ఏజన్సీ ద్వారా పరీక్షల ప్యాడ్స్ శనివారం అందచేశారు. ఈ సందర్భంగా అంబుజా గ్యాస్ ఏజన్సీస్ నిర్వహకులు, భీమదేవరపల్లి మాజీ మండల ఉపాధ్యక్షులు పి.వి.





మదన్ మోహన్ మాట్లాడుతూ గత చాలా కాలంగా విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో పదో తరగతి, సీనియర్ ఇంటర్ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందిస్తున్నట్లు తెలిపారు. సీనియర్ ఇంటర్ లో మంచి మార్కులు సాధించి ఉన్నత లక్ష్యాలను చేరాలన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అంచించే లక్ష్యంతో పి.వి.ప్రధానిగా వున్నప్పుడు నాటి విద్యా మంత్రి డా.పి.వి.రంగారావు పాఠశాల ప్రారంబించిన విషయాన్ని గుర్తు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు, శాసన సభ్యులు, పి.వి.కుటుంబం ఎంతో సహకరిస్తున్నారని కొనియాడారు. ఇంకా కొన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ధర్మ, భార్గవి, అఫ్రిన్ సుల్తానా, అముక్త, సైకా, సుధారాణి, శిరీష, రజిత, వసంత, మహేశ్, రవి పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు బైక్‌తో సహా బావిలో పడ్డ వేలేరు సర్పంచ్

**వేలేరు మార్చి 18 (ప్రజామంటలు):** హన్మకొండ జిల్లా వేలేరు మండల గ్రామ సర్పంచ్ కాయిత మాధవరెడ్డి ప్రమాదవశాత్తు బైక్ తో సహా బావిలో పడ్డారు.



తన వ్యక్తిగత పని పై హన్మకొండ కు వెళ్లి తిరిగి వేలేరు కు వస్తుండగా మండలం లోని బండతండా సమీపంలో బైక్ అదుపుతప్పి ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న బావిలో బైక్ తో సహా బావిలో పడ్డారు. సర్పంచ్ మాధవరెడ్డి కి ఈత రావడంతో వెంటనే బావిలో ఉన్న తాడును గట్టిగా పట్టుకొని అరవడంతో అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి తాడు సహాయంతో బయటకు తీశారు. వెంటనే 108 వాహనంకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్న వైద్య సిబ్బంది సర్పంచ్ కి ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం హన్మకొండ ఆసుపత్రికి తరలించారు.

## సెలవు దినాల్లో పని చేయిస్తున్నారని మున్సిపల్ కార్మికుల ఆందోళన

**జగిత్యాల మార్చి 18 (ప్రజామంటలు):** సెలవు దినాల్లో కుడా తమతో పారిశుధ్య పని చేయిస్తున్నారని ఆవేదనతో ఉదయం 4 గంటల నుండి జగిత్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట విధులు బహిష్కరించి ఆందోళ చేసిన మున్సిపల్ పారిశుధ్య కార్మికుల. గతంలో నెలలో నాలుగు ఆదివారలకు గాను ఒక ఆదివారం మాత్రమే పని చేసేవరమని, ఎపుడు ఆదివారం సెలవులో లేకుండా నాలుగు ఆదివారాలు కూడా పని చాయిస్తున్నారని, వారికి సెలవుపై కూడా ఇవ్వడం లేదని, ఒక్క పుట రాకపోయినా ఆ రోజు జీతం కట్ చేస్తున్నారని కార్మికులి ఆవేదన చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ మున్సిపల్ కమిషనర్ నరష్ వచ్చి కార్మికులతో మాట్లాడి సముదాయించారు. ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ... ఇంటి పన్నులు ఎవరు కట్టడం లేదని, ఇంటి పన్ను కట్టని వారి చెత్త తీసుకెలమని చెప్పాలని సూచించారు. ప్రతి ఒక్కరిని తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వమని చెప్పాలన్నారు. అనంతరం కార్మికులు తిరిగి తమ విధులలోకి వెళ్లారు.

# ఖిల్లాను జిల్లాకు ఎస్సెట్ లాగా అభివృద్ధికి కృషి చేస్తాం

◆ జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాష

**జగిత్యాల మార్చి 18 (ప్రజామంటలు):** జగిత్యాలలో శతాబ్దాల క్రితం నిర్మించిన, చారిత్రక ప్రాశస్త్యం గల 'జగిత్యాల ఖిల్లా'ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాష అన్నారు. జిల్లా కు అసెట్ గా జగిత్యాల ఖిల్లా ను అభివృద్ధి చేసే ఉద్దేశ్యంతో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ మందా మకరంద్ తో కలిసి శనివారం ఖిల్లా ప్రస్తుత పరిస్థితిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఖిల్లా ప్రత్యేకత ను జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాంస్కృతిక, చారిత్రక వారసత్వం గల జగిత్యాల ఖిల్లా అర్కిటెక్చర్ స్ట్రక్చర్ దెబ్బతినకుండా పురావస్తు శాఖ నిపుణుల సహాయంతో చారిత్రక ప్రాశస్త్యం, వైభవం ఉట్టిపడేలా పర్యాటకులను అమితంగా ఆకర్షించేలా జిల్లాకు అస్సెట్ గా ఖిల్లా ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. పురావస్తు శాఖ నిబంధనల ప్రకారం పర్యాటక పరంగా జగిత్యాల కోటను మరింత అభివృద్ధి చేసేందుకు పర్యాటక శాఖ, మున్సిపల్, ఇతర ప్రభుత్వ శాఖల సహకారం, సమన్వయంతో సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక ( డిపిఆర్ )ను త్వరలో సిద్ధం చేసి అనుమతి కోసం ప్రభుత్వానికి పంపిస్తామని అన్నారు. ప్రభుత్వము నుంచి ఆమోదం రాగానే పేరెన్నికగన్న అర్కియాలజిస్ట్ లు, ల్యాండ్ స్కేపింగ్ నిపుణుల సహకారంతో అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. వీలైనంత వేగంగా పనులు పూర్తి చేసి ఖిల్లా వైభవాన్ని ప్రజలందరికీ తెలిసేలా చేస్తామని చెప్పారు రాబోయే కాలంలో టూరిజం హబ్ గా ఖిల్లా ను మారుస్తామని అన్నారు. కలెక్టర్ వెంట వెంట స్థానిక మున్సిపల్



చైర్మన్ గోలి శ్రీనివాస్, ఆర్డీఓ మాధురి, డిఎఫ్ఓ వెంకటేశ్వర్ రావు, మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ నరేష్ , డిఆర్ డిఓ లక్ష్మి నారాయణ, అర్కియాలజి ఎడి సాగర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

# హాత్ సే హాత్ జోడో యాత్ర

**జనగామ మార్చి 18 (ప్రజామంటలు):** టీపీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య ఆదేశాల మేరకు ఎఐసిసి మాజీ అధ్యక్షులు రాహూల్ గాంధీ భారత్ జోడో యాత్రకు కొనసాగుంపుగా జనగామ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమంలో భాగంగా జనగామ పట్టణం కామాక్షి ఫంక్షన్ నుంచి 23వ వార్డు మరియు 21వ వార్డులో భారత్ జోడో యాత్ర సందేశాన్ని హాత్ సే హాత్ జోడో యాత్రలో ప్రజలతో మమేకమై కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెంచారపు శ్రీనివాస్ రెడ్డి,జనగామ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాసాన్ పల్లి లింగజి, 21వ వార్డు కాంటెస్ట్ అభ్యర్థి బొరెల్లి సిద్ధులు మహేశ్వరం శ్రీనివాస్ దేవర సత్తయ్య పులిగిల్లా శివ యాదవ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కీసర దిలీప్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా అప్పటి అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్యలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తెలియజేస్తూ కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. వృద్ధులందరికి పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు, సబ్సిడీ ఎరువులు రైతు రుణమాఫీ, విత్తన సబ్సిడీ, పనిముట్ల సబ్సిడీ, ఉచిత బావుల తవ్వకాలు, బోరుబావులు భూమిలేని పేదలకు భూ పంపిణీ, ఉచిత వ్యవసాయ కరెంటు, దళితులకు 50 యూనిట్ల కరంటు ఉచితం, మహిళలకు పావలావడ్డీ రుణాలు, మ్యాచింగ్ గ్రాంట్, ఆడపిల్లలకు 20 వేల బాండ్, ఉచిత బస్ ప్రయాణం, ఆరోగ్య శ్రీ, ఉద్యోగులకు హెల్త్ కార్డు, ఫీజు రియంబర్స్మెంట్ ఎన్నో పథకాలను ప్రజలకు చేరువైన తీరును ప్రజలముందు పెట్టి నేడు అమలవుతున్న పథకాల విధానాలను, పాలకుల నడవడికను అడిగి తెలుసుకుంటూ రానున్న రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే చేయబోయే పక్క హామీలు వివరించారు. రెండు లక్షల రూపాయల రైతుకు రుణమాఫీ ఇందిరమ్మ ఇల్లు ధరణి పోస్టల్ రద్దు, మహిళా సంక్షేమం ఉద్యోగ



క్యాలెండర్ లాంటివి వివరిస్తూ హాత్ సే హాత్ జోడో యాత్రను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు కాంటెస్ట్ అభ్యర్థి దొర్నాల వెంకటేశ్వర్లు యూత్ కాంగ్రెస్ జనగామ పట్టణ అధ్యక్షుడు యండి మాజిద్ జనగామ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ పిట్టల సతీష్ వేముల మల్లేష్ జయ మల్లేశ్ జనగామ నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ యండి ఫయాజ్ యూత్ కాంగ్రెస్ నాయకులు సౌద మహేష్, కొండ శ్రీనివాస్, బెజడి హరీష్, కొండ కిరణ్, సులేగం, రాఘవేంద్ర, మోటే మల్లేశం పాల్గొన్నారు.

# కెటిఆర్ రాజీనామా చేయాలి

◆ జనగామలో బిజెపి దర్నా

**జనగామ మార్చి 18 (ప్రజామంటలు):** టిఎస్పి పి ఎస్సి ఏఈ పరీక్ష పత్రం లీకేజీ వ్యవహారంపై బాధ్యత వహిస్తూ ఐటి శాఖ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమం భారతీయ జనతా పార్టీ జనగామ జిల్లా అధ్యక్షులు ఆరుట్ల దశమంత రెడ్డి నాయకత్వంలో కలెక్టర్ ఆఫీస్ ముట్టడి చేశారు. ఈ సందర్భంగా ఆరుట్ల దశమంత రెడ్డి మాట్లాడుతూ.... ఈ టిఎస్ పిఎస్సి పేపర్ లీకేజీ వ్యవహారం తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. టీఎస్ పీఎస్సీ చైర్మన్ గా వ్యవహరిస్తున్న జనార్ధన్ రెడ్డిని పదవి నుంచి తొలగించాలని నిరుద్యోగ యువకుల జీవితాలతో ఆడుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని నిరుద్యోగ యువతకు భాజపా అండగా ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవీఎల్ఎన్ రెడ్డి సిరికొండ విద్యాసాగర్ రెడ్డి, గాడిపల్లి ప్రేమలత రెడ్డి, ఉడుగుల రమేష్,ముక్కెర తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సౌద రమేష్ శివరాజ్ యాదవ్ శ్రీనివాస్ రెడ్డి లేగ రామ్మోహన్ రెడ్డి బేజాడ బీరప్ప దొంగరి మహేందర్ మాదాసు వెంకటేష్ బల్ల శ్రీనివాస్ అంజిరెడ్డి బొజ్జపల్లి సుభాష్ ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు గుజ్జుల నారాయణ




యువమోర్చా జిల్లా అధ్యక్షులు మహిపాల్ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు సోమిడి వెంకటరెడ్డి ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు రామకోటి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఒకే వేదికపై సిటీ విమెన్ ఆస్ట్రాలజీ పండితులు

◆ పద్మారావునగర్‌లో జ్యోతిష్ సదన్ సెమినార్

**సికింద్రాబాద్ మార్చి 18 (ప్రజామంటలు):** పురుషులకు ధీటుగా తాము ఏ రంగంలోనైనా రాణిస్తామంటున్నారు నేటి మహిళలు. ఎనిమిది శాఖల ఐకాస్ సభ్యులు హాజరైన ఈ సదస్సును డాక్టర్ గాయత్రి దేవి జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించారు. ఆస్ట్రాలజీ స్కిల్ డెవలప్మెంట్, ఫ్యూచర్ ఐడియాస్, గ్రహాల గమనం, జ్యోతిష్య మెళు కవలపై సదస్సులో చర్చించారు. ఈసందర్భంగా ఆలిండియా



శనివారం పద్మారావునగర్ లోని కౌతా కామకోటి ఆడిటోరియంలో నగరానికి చెందిన మహిళా జ్యోతిష్య పండితులంతా ఒకే చోటకు చేరుకున్నారు. మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఇండియన్ కౌన్సిల్ ఫర్ అస్ట్రాలజికల్ సైన్స్ (ఐకాస్) సంస్థ ఆధ్వర్యంలో జ్యోతిష్ సదన్ పేర నిర్వహించిన సెమినార్ కు ముఖ్య అతిథిగా హాజరైన ఐకాస్ మహిళా విభాగం వ్యవస్థాపకురాలు, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ గాయత్రి దేవి వాసుదేవన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ .... భారతీయ జ్యోతిష్య రంగంలో నేడు మహిళలు కూడ రాణించడం ఎంతో శుభపరిణామమని అన్నారు. సిటీలోని ఐకాస్ డిప్యూటి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ వాణి వినోద్, సికింద్రాబాద్ చాప్టర్ చైరపర్సన్ డాక్టర్ కే. సూర్యకాంతి లకు జ్యోతిష్య కళామణి అవార్డులతో సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన డా. గాయత్రిదేవి లను ఐకాస్ ఆధ్వర్యంలో సత్కరించారు. తాము 2015 లో మహిళా ఆస్ట్రాలజీ మహిళా విభాగాన్ని ప్రారంభించినట్లు ఆర్గనైజర్ డా. వాణి వినోద్ తెలిపారు. కార్యక్రమంలో ఐకాస్ ప్రతినిధులు గోపాలకృష్ణ, రాజేంద్రన్, రామచంద్రరావు, సావిత్రి మహేశ్ లు పాల్గొన్నారు.

## బొమ్మ వెంకన్న వర్ధంతి నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు

**హుస్నాబాద్ 18 మార్చి (ప్రజామంటలు):** స్వర్గీయ బొమ్మ వెంకటేశ్వర్లు 4 వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసిన – సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ.... బొమ్మ వెంకన్న ఇందుర్తి నియోజకవర్గంలో నాలుగు పరియాలు పోటీ చేసి, మూడు సార్లు ఓడిపోయిన, నియోజకవర్గంగానీ వొదులకుండ, ఒకసారి



ఎమ్మెల్యే గా గెలుపొందిన బొమ్మ వెంకన్న ఈ ప్రాంత రైతులకు లో ఓల్టేజ్ కరెంట్ సమస్య లేకుండా అదే విధంగా హుస్నాబాద్, కోహెడ, చిగురుమామిడి, బెజ్జెంకి కానీ మండల సబ్ స్టేషన్ లను పూర్తి చేసిన మన ప్రాంత రైతులకు ఓల్టేజ్ సమస్య లేకుండా తీర్చిన వ్యక్తి మన బొమ్మ వెంకన్న మరి ఇక్కడ ఎన్నో పోరాటాలు చేశారు..మన నియోజకవర్గంలో రైతులకు అన్యాయం కావద్దు అని పదవి లేకుండా ఇక్కడ ఉండి సమస్యలను తీర్చిన గొప్ప నాయకుడు బొమ్మ వెంకన్న.. నీళ్ల కోసం కానీ రోడ్ల కోసం కానీ అప్పుడు రామవరం నుంచి వరల్డ్ బ్యాంక్ సోర్స్ రావడానికి బొమ్మ వెంకన్న కృషి చేశారు. బొమ్మ వెంకన్న ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు..ఈ కార్యక్రమంలో పిసిసి డెలికేట్ కమిటీ సభ్యులు లింగమూర్తి, హుస్నాబాద్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బంక చందు, పాల్గొన్నారు.

## త్వరిత గతిన పోలీస్ సముదాయ కార్యాలయ నిర్మాణం

**పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్**

**జగిత్యాల మార్చి 18 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రంలోని థరూర్ క్యాంప్ అవరణంలో నిర్మాణంలో ఉన్న పోలీసు కార్యాలయ సముదాయ భవనాల



నిర్మాణం పనులు, ఎస్పీ క్యాంప్ ఆఫీస్ మరియు ఎస్పీ రెసిడెన్షియల్, ఏఆర్ హెడ్ క్వార్టర్స్ పనులను సందర్శించి నిర్మాణం జరుగుతున్న తీరును పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చెర్మెన్, జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చెర్మెన్ కోలేటి దామోదర్ మాట్లాడుతూ.... ప్రజలకు సత్వర పోలీస్ సేవలు అందించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అన్ని హంగులతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్న జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయాల సముదాయాల పనులన్నీ త్వరగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన ప్లాన్ ప్రకారం మాత్రమే నిర్మాణ పనులు జరగాలని సూచించారు.

## టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ ఘటనపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

**బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శికారి గోపికృష్ణ**

**కోరుట్ల టౌన్ 18 మార్చి (ప్రజామంటలు):** టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ ఘటనపై పరీక్షలు రద్దు చేసి చేతులు దులుపుకోవడం కాదని, మొత్తం పబ్లిక్ సర్వీస్ కమిషన్?ను రద్దు చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శికారి గోపికృష్ణ ఆగ్రహాన్ని వెలుబుచ్చారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ ఘటనపై ఆర్డీవో వినోద్ కుమార్‌కు మెమోరాండంను అందజేశారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సిట్ విచారణపై తమకు పూర్తి నమ్మకం లేదని ఈ ఘటనపై సిటింగ్ జడ్జి చేత విచారణ జరిపించి నిరుద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలని గోపికృష్ణ డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు జరిగిన నష్టానికిగాను రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహిస్తూ తక్షణమే టీఎస్‌పీఎస్‌సీ బోర్డ్ చైర్మెన్ను తొలగించి పేపర్ లేకీజికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకి న్యాయం చేయకుంటే బి.సి సంక్షేమ సంఘం రోడ్డెక్కుతుందని రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమ కార్యక్రమాలు చేపడుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



## ఎల్కతుర్తిలో బొమ్మ వెంకన్న వర్ధంతి వేడుకలు

**ఎల్కతుర్తి మార్చి 18 (ప్రజామంటలు):** మాజీ ఎంఎల్ఏ బొమ్మ వెంకన్న 4వ వర్ధంతి సందర్భంగా ఎల్కతుర్తి మండల కేంద్రం బస్టాండ్ కుడలి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన బిజేపి శ్రేణులు



అనంతరం బొమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్లైండ్ చిల్డ్రన్స్ కు పండ్లు పంపిణీ చేయడం జరిగింది శ్రీపతి మధుకర్ గౌడ్ నేతృత్వంలో ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ మండల అధ్యక్షుడు ముష్కే వెంకటేష్ సీనియర్ నాయకులు శ్రీపతి మధుకర్ గౌడ్ జనగాని కృష్ణయ్య కంచర్ల శంకరయ్య నాంపల్లి అశోక్ పెరుగు మధుసూదన్ చిదురాల వెంకటేష్ పల్లెపాటి మధుకర్ మండల ప్రధాన కార్యదర్శి కోరే కార్తిక్, బిజేవైఎం మండల అధ్యక్షులు మన్నుర్తి శ్రీకాంత్, ఓబీసీ మండలాధ్యక్షులు గుడిశాల వినయ్ గౌడ్, కాంగ్రెస్ మండల పార్టీ సీనియర్ నాయకులు పాక రమేష్, బిజేవైఎం జిల్లా నాయకులు ఎర్రగోళ్ల రాజు, బిజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి అంచనగిరి వెంకటరమణ, మురహరి, వేణు, బోనగిరి వెంకటేష్, బొమ్మ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# రంగమార్తాండ చూడాల్సిన సినిమా





### భావోద్వేగానికి గురైన సింగర్ సునీత

క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ తెరకెక్కించిన 'రంగమార్తాండ' చూడాల్సిన చిత్రం. ఎమోషన్స్‌కు గురవుతాం. గుండె బరువెక్కేలా తీసారు. చిత్రాన్ని చూసిప సింగగర్ సునీత .. వెంటనే ఓ వీడియోని షేర్ చేసింది. ఆ వీడియోలో..ఇప్పుడే రంగమార్తాండ సినిమా చూశాను. ఈ వీడియో చేయకుండా ఉండలేకపోతున్నాను. ఒక సినిమాలో.. మూడు పాత్రలు ప్రకాశ్ రాజ్‌గారు, బ్రహ్మానందంగారు, రమ్యకృష్ణగారు ఎంత ఇంపాక్ట్ క్రియేట్ చేశాయి అంటే.. వాళ్ల అభినయంతో మనసంతా బరువైపోయింది. చాలా గుబులుగా అనిపిస్తుంది. మీకు తెలుసా.. ఇటువంటివి నిత్యం ఉంటే మాత్రం.. బయట పడటానికి రకరకాల మార్గాలు వెతుక్కుంటాం. కానీ నా పరిస్థితి ఏంటో తెలుసా? ఆ బరువు చాలా బాగుంది. మనసు గుబులుగా ఉంటూనే.. అందులోనే ఉండాలనిపిస్తుంది. అలాగే ఎంజాయ్ చేయాలని అనిపిస్తుంది. అంత గొప్ప నటనను కృష్ణవంశీగారు రాబట్టడం అనేది.. ఓ మై గాడ్.. ఆయనకే సాధ్యమైంది.. హ్యాట్సాఫ్. 'రంగమార్తాండ' తప్పకుండా చూడాల్సినటువంటి సినిమా. నేను గట్టిగా రికమెండ్ చేస్తున్నాను. దయచేసి వెళ్లి చూడండి. మీ హృదయాలను కదిలించే సన్నివేశాలు ఇందులో ఎన్నో ఉన్నాయని నేను చెప్పగలను. చాలా రిలేటబుల్ స్టోరీ.. అంటూ 'రంగమార్తాండ' సినిమాపై తన మనసులోని భావాల్ని సునీత పంచుకున్నారు. ప్రస్తుతం సింగర్ సునీత షేర్ చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రీసెంట్‌గా ఇండస్ట్రీలోని మహిళలకు 'రంగమార్తాండ' చిత్రాన్ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. షో అనంతరం అందరూ దాదాపు సింగర్ సునీత ఇచ్చిన, చెప్పిన ఎక్స్‌ప్రెషన్‌నే వెలిబుచ్చారు. వారే కాదు.. ఇప్పటి వరకు ఈ సినిమాని చాలా మందికి కృష్ణవంశీ చూయించారు.. చూసిన ప్రతి ఒక్కరూ భావోద్వేగంగా రియాక్ట్ అవుతున్నారు. కాగా.. 'రంగమార్తాండ' చిత్రం ఈ నెల 22న ఉగాది స్పెషల్‌గా థియేటర్లలో విడుదల కాబోతోంది.

### నెపోటిజంపై కుండబద్దలు కొట్టిన రామ్‌చరణ్

మా నాన్నగారి వల్లే పరిశ్రమలోకి వచ్చాను. నాన్న సపోర్ట్ ఉన్నా ఈ పోటీ ప్రపంచంలో ఎదగాలి అంటే నా ప్రయాణాన్ని నాకు నేనుగా ముందుకు సాగించాలి. ప్రతిభ లేకపోతే సినిమా ఇండస్ట్రీలో ప్రయాణం అంత సులభం కాదు అని నటుడు రామ్‌చరణ్ అన్నారు. ఇదే విషయంపై ఢిల్లీ వేదికగా రామ్‌చరణ్ మాట్లాడారు. స్టార్ హీరోకి కుమారుడిగా సినిమాల్లోకి వచ్చినా ప్రతిభ లేకపోతే ఇక్కడ ముందుకుసాగడం కష్టమని తెలిపారు. ప్రతిభ ఉంటేనే ఇండస్ట్రీ అయినా, ప్రేక్షకులైనా ప్రోత్సహిస్తారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

# సినిమా రంగంలో ప్రతిభ లేకుండా రాణించలేం

నెపోటిజం మాట విన్న ప్రతిసారీ నాకు ఆశ్చర్యంగా ఉంటుంది. ఈ మధ్యకాలంలో దీని గురించి చాలా పెద్ద చర్చ జరిగింది. బంధుప్రీతి ఉందని ఊహల్లో ఉండేవారి వల్లే ఇంత చర్చ జరుగుతోంది. చిన్నప్పటి నుంచి నాకు యాక్టింగ్ అంటే ఇష్టం. సినిమానే ఊపిరిగా తీసుకుంటూ ఎంతోమంది నిర్మాతలను కలుసూ సినిమాలు చేస్తున్నా. నా మనసుకు నచ్చిన పని చేయడం, అది ప్రేక్షకులకు, అభిమానులకు నచ్చడం వల్లే 14 ఏళ్లుగా ఇక్కడ సక్సెస్‌ఫుల్‌గా నిలబడగలిగాను అని అన్నారు. భవిష్యత్తులో మీరు చేయాలనుకుంటున్న జానర్ ఏంటి అని ప్రశ్నించగా 'స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో సినిమా చేయాలనుందని, విరాట్ కోహ్లీ బయోపిక్ తీస్తే అందులో నటించడానికి సిద్ధంగా ఉన్నానని చరణ్ చెప్పారు. మా తరం హీరోలకు నాన్న పెద్ద పోటీగా నిలిచారు. ఇప్పుడు ఆయన వయసు 67 ఏళ్లు. ఇప్పటికీ ఎంతో ఎనర్జీగా పని చేస్తారు. తెలవారుజామున 5 గంటలకే ఆయన డే స్టార్ అవుతుంది. టైమ్‌కి సెట్‌లో ఉంటారు. ఆయన అంత యాక్టివ్‌గా, డెడికేషన్‌తో పని చేస్తుంటే నేను 10 గంటలకు నిద్రలేవడం కరెక్ట్ కాదు కదా. నాకూ నాన్నలాగే అలవాటైంది. ఈ ఏడాది నాన్న రెండు చిత్రాలు చేశారు. అందులో 'వాల్తేరు వీరయ్య' విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్ అయింది. రెండోది రెడీ అవుతుంది. ఆయన ఈ వయసులో కూడా అంతగా కష్టపడి పనిచేస్తుంటే మేం అంతకు మించి చేయాలి కదా! నాన్న చెప్పే ప్రతి విషయాన్ని బలంగా నమ్ముతా అని అన్నారు.

# శరవేగంగా సలార్ షూటింగ్

### ఇటలీలో యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ



ప్యాన్ ఇండియా స్టార్ ప్రభాస్ 'సలార్' షూటింగ్ వేగం పెంచారు. ఆయన అభిమానులు ఎంతగానో కోరుకునే యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో అలరించడానికి ప్రభాస్ సిద్ధమవుతున్నారు. సినిమా గురించి నిర్మాణ సంస్థ ఎలాంటి అప్‌డేట్ ఇవ్వకపోయినా అంచనాలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణలో నిమగ్నమయ్యారు. ఈ చిత్రం కోసం భారీ యాక్షన్ సీన్స్ రూపొందిస్తున్నారట ప్రశాంత్ నీల్. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ ఇటలీలో జరుగుతోందని సమాచారం. అక్కడ ప్రభాస్, విలన్ గ్యాంగ్‌పై సాగే భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్టుగా సమాచారం. ఈ ఎపిసోడ్ సినిమాకు హైలైట్‌గా నిలువనుందని చిత్ర బృందం చెబుతోంది. ఈ షెడ్యూల్‌తో 85 శాతం చిత్రీకరణ పూర్తవుతుందని, వచ్చే నెలతో సినిమా పూర్తి చేసి పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలకు వెళ్తారట. ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడీగా శ్రుతిహాసన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్ 28వ ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.



# కేజీయఫ్' చిత్రంపై దర్శకుడు వెంకటేశ్ మహా కామెంట్స్

### విభేదించిన నేచురల్ స్టార్ నాని

కేజీయఫ్' చిత్రంపై దర్శకుడు వెంకటేశ్ మహా చేసిన కామెంట్స్‌పై తాజాగా నేచురల్ స్టార్ నాని స్పందించారు. ఈ చర్చలో జరిగిన మొత్తం వ్యవహారాన్ని ఉద్దేశించి దురదృష్టకరమన్నారు. వెంకటేశ్ మహా మాట్లాడిన తీరు కరెక్ట్ కాదని నాని అభిప్రాయపడ్డారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మోహన్‌కృష్ణ ఇంద్రగంటి, నందినిరెడ్డి, వివేక్ ఆత్రేయ, శివ నిర్వాణ, వెంకటేశ్ మహా ఓ యూట్యూబ్ ఛానల్ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. 'కేజీయఫ్' చిత్రాన్ని ఉద్దేశిస్తూ.. 'తల్లి కలను నెరవేర్చడం కోసం బంగారాన్ని సంపాదించి.. చివరికి ఆ మొత్తాన్ని సముద్రంలో పడేశాడు. అలాంటి వ్యక్తి గురించి సినిమాలు చేస్తే మనం చప్పట్లు కొడుతున్నాం, కోట్లు కలెక్షన్లు తెచ్చిపెడుతున్నాం' అంటూ పలు అసభ్య పదజాలాన్ని ఉపయోగించి దర్శకుడు వెంకటేశ్ మహా చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అయిన సంగతి తెలిసిందే! కేజీఎఫ్, యశ్ అభిమానులు వెంకటేశ్‌పై విపరీతంగా ట్రోల్ చేశారు. దీనిపై వెంకటేశ్ మహా వివరణ ఇచ్చారు. తాజాగా దీనిపై నాని మాట్లాడారు. కమర్షియల్ సినిమా అనే అంశంపై దర్శకులు పాల్గొన్న చర్చను నేనూ చూశా. వెంకటేశ్ మహా మాట్లాడిన విధానం కరెక్ట్ కాదు. ఓ సినిమా చూసొచ్చాక దాని గురించి మన ఫ్రెండ్స్‌తో ఒకలా మాట్లాడతాం, మరొకరితో ఇంకోలా మాట్లాడతాం. అదే పాయింట్ చర్చ వేదికల్లో ఇంకోలా చెబుతాం. ఇటీవల జరిగిన దర్శకుల చర్చాలోనూ అదే జరిగింది. కమర్షియల్ సినిమా అనే అంశంపై జరుగుతున్న చర్చ కాస్త ఉన్నట్లుండి థియేటర్ బయట మాట్లాడే విధంగా మారింది. అతను విమర్శలు ఎదుర్కోవడానికి కారణం అదే. ఆ టాపిక్ మాట్లాడుతున్నప్పుడు మహా కాస్త అప్రమత్తం గా ఉంటే సరిపోయేది. ఈ వివాదంపై ఇప్పటికే వివరణ ఇచ్చాడు కాబట్టి.. అతడి గురించి మాట్లాడను. ఇక అదే ప్రోగ్రామ్‌లో పాల్గొన్న నలుగురు దర్శకులు నాకు బాగా తెలుసు. వారితో నేను పనిచేశాను. వాళ్లకు మాస్, కమర్షియల్ సినిమా అంటే ఎంతో ఇష్టమో నాకు తెలుసు. ఓ అభిప్రాయాన్ని సరదాగా చెప్పినప్పుడు పక్కన ఉన్న వాళ్లు నవ్వడం సహజం. దాన్ని తప్పుగా అనుకొని వాళ్లందర్నీ విమర్శించడమూ కరెక్ట్ కాదు. జరిగిన ఇంటర్వ్యూ మొత్తంలో చిన్న క్లిప్‌ను పట్టుకు ఒక అభిప్రాయానికి రాకూడదు. నేను అయితే అలా చేయను. ఏది ఏమైనా అలాంటి సంఘటన చోటుచేసుకోవడం నిజంగా దురదృష్టకరం అని అన్నారు నాని.



# భోళా శంకర్‌లో అన్నా చెల్లెళ్లదే కీరోల్

### చిరుకు సోదారిగా నటిస్తున్న కీర్తి సురేశ్

మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న భోళా శంకర్ సినిమాలో తమన్నా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెల్సిందే. చిరంజీవికి సోదరి పాత్రలో కీర్తి సురేష్ నటిస్తోంది. చిరంజీవి మరియు కీర్తి సురేష్ కాంబోలో వచ్చే అన్నా చెల్లి సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా ఉంటాయని యూనిట్ సభ్యులు చెబుతున్నారు. సినిమాలో కీర్తి సురేష్ కు ప్రియుడి పాత్రలో అక్కినేని హీరో సుశాంత్ నటిస్తున్నట్లుగా తెలుస్తోంది. హీరోగా పలు సినిమాల్లో నటించి కమర్షియల్ సక్సెస్ లను దక్కించుకోలేక పోయిన సుశాంత్ ఈమధ్య కాలంలో వరుసగా క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఇతర హీరోల సినిమాల్లో నటిస్తున్న విషయం తెల్సిందే. భోళా శంకర్ సినిమాలో సుశాంత్ పాత్ర ను మొదట అనుకున్నదాని కంటే కాస్త ఎక్కువ చేశారని తెలుస్తోంది. సుశాంత్ పుట్టిన రోజు సందర్భంగా భోళా శంకర్ యూనిట్ సభ్యులు ప్రత్యేకంగా పోస్టర్ ను విడుదల చేసి శుభాకాంక్షలు తెలియజేయనున్నారట. మెహర్ రమేష్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా సినిమా ఉంటుందనే నమ్మకాన్ని యూనిట్ సభ్యులు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. అతి త్వరలోనే సినిమా చిత్రీకరణ ముగించి దసరా కానుకగా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలని భావిస్తున్నారు. చిరంజీవి గత చిత్రం వాల్తేరు వీరయ్య భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం వల్ల ఈ సినిమా తో మరో విజయాన్ని దక్కించుకోవడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా దర్శకుడు మెహర్ రమేష్ ఈ సినిమాను రూపొందిస్తున్నాడట.



# 2023 మోస్ట్ అవైటెడ్ జాబితాలో పుష్ప 2 నం.1

గూగుల్ సెర్చ్ లో ట్రెండింగ్ అవుతూ నిరంతరం అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్న సినిమా ఏది? అన్నది పరిశీలిస్తే..హిందీ బెల్ట్ లో వాస్తవ సన్నివేశం ఇలా ఉంది. ఈ జాబితాలో తొలి పది ర్యాంకుల్లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న పుష్ప : ది రూల్ (పుష్ప2-హిందీ) నంబర్ వన్ క్రేజ్ తో టాప్ స్లాట్ లో నిలిచింది. ఈ సినిమా ఎప్పుడు రిలీజవుతుందా? అంటూ ఉత్తరాది అభిమానులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. చాలా కాలంగా మాలీవుడ్ ని మల్లూ అర్జున్ గా ఏలుతున్న టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్ ప్రస్తుతం ఉత్తరాది పెహన్ షాగా మారాడు. పుష్ప -2తో సునాయాసంగా 1000 కోట్లు కొల్లగొట్టాలన్న పంతంతో పుష్ప రాజ్ దూకుడుగా దూసుకురాబోతున్నాడు. ప్రస్తుతం గూగుల్ సెర్చ్ సహా క్రేజ్ దృష్ట్యా అన్ని విధాలుగా పుష్ప2 చిత్రంపై అభిమానుల ఫోకస్ ఉందని సర్వే చెబుతోంది. ఆ తర్వాత ఖిలాడీ అక్షయ్ కుమార్- పరేష్ రావల్- సంజయ్ దత్ లతో మల్టీస్టారర్ కేటగిరీలో తెరకెక్కనున్న హేరా ఫేరి 3 పై ఫోకస్ అమాంతం మళ్లిందని సర్వే చెబుతోంది. హేరాఫేరి 3 ప్రకటించక మునుపు సల్మాన్ భాయ్ టైగర్ 3 ట్రెండింగ్ లో ఉండేది. ఇప్పుడు టైగర్ మూడో స్థానంలో నిలుస్తోంది. సల్మాన్ ఖాన్ నటిస్తున్న ఈ చిత్రంలో షారూఖ్ ఖాన్ అతిథిగా మెరవనున్నాడు. పఠాన్ ఘనవిజయంతో సల్మాన్ - షారూఖ్ కాంబినేషన్ మూవీగా టైగర్ 3 పైనా హైప్ అమాంతం పెరిగింది. వెయ్యి కోట్ల క్లబ్ టార్గెట్ గా వస్తున్న చిత్రమిది. ఆ తర్వాత షారూఖ్ - అట్లీ మూవీ జవాన్ కి క్రేజ్ అనూహ్యంగా ఉంది. చెన్నై ఎక్స్ ప్రెస్ తర్వాత సౌత్ - నార్త్ క్రాస్ ఓవర్ కథాంశంతో దేశభక్తి నేపథ్యంలో ఖాన్ చేస్తున్న ప్రయోగమిది. ఆ తర్వాత కార్తీక్ ఆర్యన్ నటించనున్న భూల్ భూలయ్యా 3 పైనా విపరీతమైన బజ్ ఉంది. భూల్ భులయా 2 బ్లాక్ బస్టర్ విజయం సాధించడంతో పార్ట్ 3 పైనా ఆసక్తి నెలకొంది. అలాగే అజయ్ దేవగన్ భారీ చిత్రం -భోలా .. సల్మాన్ ఖాన్ - పూజా హెగ్డే జంటగా నటించిన %--%కిసీ కా భాయ్ కిసీ కా జాన్%--%.. రాకీ ఔర్ రాణి కి ప్రేమ్ కహానీ.. గదర్ 2: ది కథా కంటిన్యూస్...బడే మియాన్ చోటే మియాన్ చిత్రాలపైనా ఉత్తరాది ఆడియెన్ లో ఆసక్తి నెలకొంది. వీటన్నిటితో పాటు ఇతర చిత్రాలు కూడా విడుదల కానున్నాయి. మరి ఈ సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఎలా రాణిస్తాయో చూడాలి. మహమ్మారి తర్వాత ఎంటర్ టైన్ మెంట్ ఇండస్ట్రీ మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకుంటున్న వేళ పుష్ప 2 సంచలనాలు సృష్టించడం ఖాయమన్న టాక్ బలంగా ఉంది. నిజానికి కోవిడ్ 19 విలయంతో ప్రజలు థియేట్రికల్ వినోదానికి దూరమయ్యారు. అందుకే ఇప్పుడు ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ థియేటర్లకు వెళ్లేందుకు ఆసక్తిని కనబరుస్తున్నారు. దీంతో థియేటర్లు కిక్కిరిసిపోతున్నాయి. చాలా సినిమాలు ఇటీవల విడుదలైనా చాలా నీరసం ఎదురైన తర్వాత 2023 బాలీవుడ్ కు మంచి సంవత్సరంగా మారింది. షారూఖ్ ఖాన్ --పఠాన్ --బాక్సాఫీస్ వద్ద అద్భుతంగా ఆడింది. ఇప్పుడు రణబీర్ కపూర్ -శ్రద్ధా కపూర్ నటించిన --తూ జూఠీ మై మక్కర్-- చిత్రం 100 కోట్ల రూపాయల మార్కును దాటింది. మునుముందు చాలా పెద్ద సినిమాలు విడుదల కాబోతున్నందున హిందీ చిత్రాలకు ఈ సంవత్సరం బాగానే కనిపిస్తోంది. ఓర్మాక్స్ మీడియా ఇటీవల అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న హిందీ చిత్రాల జాబితాను షేర్ చేయగా ఈ జాబితాలో షారుఖ్ ఖాన్ - జవాన్... కార్తీక్ ఆర్యన్ -భూల్ భులయ్యా 3 చిత్రాలు సహా మరిన్ని క్రేజీ సినిమాలు ఉన్నాయి. కొన్ని సినిమాలు ఈ ఏడాది విడుదల కానప్పటికీ వాటిని పెద్ద తెరపై చూసేందుకు అభిమానులు చాలా ఉత్సాహంగా ఉన్నారు.




PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com